

టీడీపీ ప్రభుత్వంలో పేదల కోసం గుర్తించిన స్థలం



# దళితులు, బీసీలపై కక్ష!

- టీడీపీలో చేరారని వైసీపీ ప్రతీకార చర్య
- సాగు భూమి స్వాధీనానికి రాజకీయ కుట్ర
- ఐదేళ్లుగా పట్టించుకోని వైసీపీ పాలకులు
- ఎన్నికల వేళ ఇంటి పట్టాల డ్రామాకు తెర
- దళితుల భూముల్లో ఇచ్చేలా అధికారులపై ఒత్తిళ్లు

వైసీపీని వదిలి టీడీపీలో చేరిన దళితులు, బీసీలను ఇబ్బందులకు గురి చేయాలనే కుట్రకు అధికార వైసీపీ నాయకులు తెర తీశారు. రోడ్లు, తాగునీరు వంటి వసతులు కల్పిస్తూ గత టీడీపీ ప్రభుత్వం పదెకరాల్లో ఏర్పాటు చేసిన లే అవుట్ స్థలం ఉండగా బీసీలు, దళిత రైతులు రూ.లక్షలు ఖర్చు చేసి సాగులోకి తెచ్చుకున్న ప్రభుత్వ భూములపై కన్నేశారు. ఇంటి పట్టాలు ఇవ్వాలని రెవెన్యూ అధికారులపై ఒత్తిడి తెస్తున్నారు. అదే జరిగితే మూకుమ్మడి ఆత్మహత్యలే శరణ్యమని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రూ.10 లక్షలకు పైగా ప్రభుత్వ ధనం వెచ్చించి ఏర్పాటు చేసిన లేఅవుట్ ఉండగా.. దళితులు, బీసీలు సాగు చేసుకుంటున్న భూముల్లో పట్టాలు ఇవ్వాలని ఒత్తిడి తేవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

**కర్నూలు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి):** ఓర్వకల్లు మండలం పాలకొలను, ఉయ్యాలవాడ గ్రామం పరిధిలో ఆయుధాల పరిశ్రమ (డీఆర్‌డీఏ)ను 2,500 ఎకరాల్లో కేంద్ర రక్షణ శాఖ స్థాపించింది. ఈ పరిశ్రమ కోసం రైతులు సాగు భూములను త్యాగం చేశారు. పాలకొలను గ్రామానికి చెందిన పలువురు రైతులు కూడా సాగు భూములు కోల్పోయారు. డీఆర్‌డీఏ కోసం భూములు ఇచ్చిన వారిలో దళితులు, బీసీలు, మైనార్టీలు కూడా ఉన్నారు. పాలకొలను గ్రామం అనుకొని సర్వే నంబరు 151 పరిధిలో 82 ఎకరాలకు పైగా ప్రభుత్వ భూమి ఉంది. ఎక్కువ భాగం ఏ మాత్రం సాగుకు పని రాని రాతి పరుపు (రాక్ గార్డెన్) భూమి అది. డీఆర్‌డీఏలో భూములు కోల్పోయిన ఎనిమిది మంది బీసీ, దళిత, మైనార్టీలు వచ్చిన భూ పరిహారం డబ్బుకు తోడుగా కొంత అప్పు చేసి రాతి పరుపు భూమిపై ఎకరాకు వెయ్యికి పైగా టిప్పర్లు నల్లమట్టిని తోలించి సాగులోకి తెచ్చారు. ఎకరాకు రూ.3-5 లక్షలకు పైగా ఖర్చు చేశామని రైతులు అంటున్నారు. వ్యవసాయ బోర్లు తవ్వించుకొని 7-8 ఏళ్లుగా చీనీ, పొగాకు, మిరప.. వంటి పంటలు సాగు చేస్తున్నారు. నాటి నుంచి సాగు పట్టాలు ఇవ్వాలని రెవెన్యూ అధికారులు చుట్టూ తిరుగుతున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోలేదు. ఆ రైతులు వైసీపీని వదిలేసి టీడీపీలో చేరారు. ఇది వైసీపీ నాయకులకు మింగుడు పడడం లేదు. దీంతో ఇంటి పట్టాల పంపిణీ పేరిట దళితులు, బీసీలు సాగు చేసుకుంటున్న ఆ భూములు స్వాధీనం చేసుకోవాలని రెవెన్యూ అధికారులపై తీవ్ర ఒత్తిడి తెస్తున్నారు. ఇది అన్యాయమని క్షేత్రస్థాయిలో పరిశీలించిన మండలం రెవెన్యూ అధికారులకు తెలిసినా వైసీపీ కీలక నేతకు గట్టిగా చెప్పలేకపోతున్నారు. పట్టాలు పేరిట సాగు భూములను స్వాధీనం చేసుకుంటే సామూహిక ఆత్మహత్యలే శరణ్యమని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



**● ఆత్మహత్యలే శరణ్యం**

దేశ రక్షణ ఆయుధాల పరిశ్రమ కోసం భూములు త్యాగం చేశాం. ఊరి పక్కనే ఉన్న రాతి పరుపు ఉన్న ప్రభుత్వ భూముల్లో నల్లమట్టి తోలుకొని సాగులోకి తెచ్చుకొని బతుకుతున్నాం. ఏడేళ్ల క్రితమే ఎకరాకు రూ.3-4 లక్షలు ఖర్చు చేశాం. ఇప్పుడు మా భూముల్లో ఇంటి పట్టాలు ఇస్తామని అంటున్నారు. మాకు ఆత్మహత్యలే శరణ్యం.

**- మాదిగ ఎల్లమ్మ, పాలకొలను గ్రామం, ఓర్వకల్లు మండలం**

**● లే-అవుట్ స్థలం ఉండగా.. ఆ భూముల్లో ఎందుకు..?:**

పాలకొలను గ్రామంలో 2019లో గత టీడీపీ ప్రభుత్వంలో 350 మందికి ఇంటి పట్టాలు ఇవ్వాలని గ్రామ కంఠం అనుకొని సర్వే నంబరు 151 పరిధిలో పది ఎకరాలు ప్రభుత్వ భూమిని గుర్తించారు. ఒక్కొక్కరికి రెండు సెంట్ల ప్రకారం ఇంటి స్థలం ఇచ్చేలా రెవెన్యూ అధికారులు లే-అవుట్ వేశారు. రోడ్లు, తాగునీటి పైపులైన్ కోసం సుమారు రూ.10 లక్షల ప్రజాధనం ఖర్చు చేశారు. ఇంతలో సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్ రావడంతో పంపిణీ ఆగిపోయింది. వైసీపీ ప్రభుత్వం వచ్చాక ఎమ్మెల్యేగాని, ఆ పార్టీ నాయకులు గాని పట్టాలు పంపిణీ పట్టించుకోలేదు. దీంతో రానున్న ఎన్నికల్లో ఓట్లు పడవని గ్రహించిన వైసీపీ నాయకులు ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు బదిలీపై వెళ్లిన తహసీల్దారు శివప్రసాద్‌రెడ్డిపై ఒత్తిడి తెచ్చి 320 మందికి మ్యాన్‌వల్‌గా పట్టాలు సిద్ధం చేశారు. టీడీపీ ప్రభుత్వంలో వేసిన లే-అవుట్ స్థలంలో పట్టాలు ఇస్తే టీడీపీకి మంచి పేరు వస్తుందని అదే సర్వే నెంబరులోని దళితులు, బీసీలు సాగు చేసుకుంటున్న 18 ఎకరాలపై కన్ను పడింది. ఆ భూముల్లోనే కొత్తగా లే-అవుట్ వేసి పట్టాలు ఇవ్వాలని ఒత్తిడి తెస్తున్నారు. బదిలీపై వెళ్లిన తహసీల్దారు శివప్రసాద్‌రెడ్డి ఒప్పుకోలేదు. ఇటీవలే బదిలీపై వచ్చిన తహసీల్దారు నట్రాజ్‌పై కూడా ఒత్తిడి తేవడంతో ఆయన ఆ భూములను పరిశీలించారు. దీనంతటికి కారణం ఆ రైతులు వైసీపీని వదిలేసి టీడీపీలో చేరడమేనని ఆ గ్రామ టీడీపీ నాయకుడు సుధాకర్‌రెడ్డి పేర్కొంటున్నారు. టీడీపీలో చేరిన రైతులను ఇబ్బంది పెట్టడమే కాకుండా టీడీపీకి మంచి పేరు రాకుండా చేయాలనే కుట్రలో భాగమే ఈ ఎత్తుగడలని ఆరోపిస్తున్నారు.



**● రాజకీయ కక్షతో అన్యాయం చేస్తారా..?**

ఆయుధాల పరిశ్రమకు జీవనాధారమైన సాగు భూములు ఇచ్చాం. సాగుకు ఏమాత్రం పనికి రాని ప్రభుత్వ భూమిలో రూ.లక్షలు పోసి సాగులోకి తెచ్చుకున్నాం. సాగు పట్టాలు ఇచ్చి ఆదుకోవాల్సింది పోయి రాజకీయ కక్షలతో అన్యాయం చేస్తారా..? ఇది న్యాయమేనా..?.

**- మాల మేరి, పాలకొలను గ్రామం, ఓర్వకల్లు మండలం**



**● రూ.లక్షలు ఖర్చు పెట్టాం**

డీఆర్‌డీఏ కోసం మా సాగు భూములు తీసుకుంటే వచ్చిన పరిహారం డబ్బు, అప్పులు చేసి ఎకరాకు రూ.3-4 లక్షలకు పైగా ఖర్చు చేసి వెయ్యి టిప్పర్లు నల్ల మట్టి తోలించి చదును చేశాం. చీనీ, మిరప.. వంటి బంగారం పంటలు పండించేలా చేసుకున్నాం. ఇప్పుడు ఆ భూములు లాగేసుకుంటామంటే మేము ఎట్లా బతకాలి. అధికారులు బలవంతంగా లాగేసుకుంటామంటే ఆ భూముల్లో మా శవాలు చూస్తారు.

**- వడ్డె లక్ష్మీదేవి, పాలకొలను గ్రామం, ఓర్వకల్లు మండలం**

**● మా భూములే కావాలా..?**

టీడీపీ ప్రభుత్వంలో మా ఊరు పక్కనే పది ఎకరాల్లో ఇంటి పట్టాలు ఇచ్చేందుకు లే-అవుట్ వేశారు. రోడ్లు, తాగునీటి పైపులు వేశారు. అక్కడ పట్టాలు ఇవ్వకుండా మా భూమే కావాలా..? ఇంతకంటే అన్యాయం మరొకటి ఉందా..? లక్షలు ఖర్చు పెట్టి రాతిబండను సాగు భూమిగా మార్చుకున్నాం. సాగు పట్టాలు ఇచ్చి ఆదుకోవాల్సింది పోయి మా పొలాలే లాగేసుకుంటామంటారా..? జీవనాధారం లేకుండా చేస్తే ఆత్మహత్యలే మాకు దిక్కు.

**- బినాబీ, పాలకొలను గ్రామం, ఓర్వకల్లు మండలం**



# పోలియో రహిత సమాజమే ధ్యేయం

**పిల్లలకు పోలియో చుక్కలు వేసిన కలెక్టర్ డా.జి. సృజన**



కర్నూలులో చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న కలెక్టర్

**కర్నూలు(హాస్పిటల్), మార్చి 3:** పోలియో రహిత సమాజమే.. మన ధ్యేయం కావాలని కర్నూలు కలెక్టర్ డా.జి. సృజన అన్నారు. ఆదివారం నగరంలోని ఎ.క్యాంపులోని ఇందిరాగాంధీ స్మారక నగర పాలక ఉన్నత పాఠశాలలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, జిల్లా ఇమ్యూనైజేషన్ శాఖ ఏర్పాటు చేసిన పల్స్ పోలియో కేంద్రంలో కలెక్టర్ డా.జి. సృజన ఐదేళ్లలోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నిండు జీవితానికి రెండు పోలియో చుక్కలు వేసి చిన్నారుల భవిష్యత్తుకు బంగారుబాటలు వేద్దామని పేర్కొన్నారు. ఐదేళ్లలోపు చిన్నారులకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని అన్నారు. అది మనందరి బాధ్యత అని అన్నారు. కార్యక్రమంలో పల్స్‌పోలియో స్టేట్ నోడల్ ఆఫీసర్ రవీంద్రారెడ్డి, డీఎంహెచ్‌వో డా.బి. రామగిడ్డయ్య, డీఈవో సామూయేల్, డీఐవో ప్రవీణ్ కుమార్, ఎస్‌వో హేమసుందరం, అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యాధికారి మాధవి, సిబ్బంది పాల్గొన్నారు.

## చెరువులో పడి ఇద్దరు బాలురు మృతి





మృతి చెందిన అమీర్, దేవేంద్ర

**కౌతాళం, మార్చి 3:** సరదాగా ఈతకు వెళ్లిన ఇద్దరు విద్యార్థులు చెరువులోపడి మృతి చెందారు. ఈ ఘటన మండల పరిధిలోని చిరుతాపల్లి గ్రామంలో ఆదివారం జరిగినది. గ్రామానికి చెందిన అమీర్(10), దేవేంద్ర(10) యువరాజ స్థానిక పాఠశాలలో 5వ తరగతి చదువుతున్నారు. ఆదివారం సెలవు కావడంతో ముగ్గురు స్నేహితులు ఈత కోసం గ్రామ సమీపంలో ఉన్న చెరువుకు వెళ్లారు. అమీర్, దేవేంద్రలకు సరిగా ఈత రాకపోవడంతో నీటిలో మునిగిపోయారు. ఈ సంఘటనను చూసిన యువరాజు చెరువు నుండి బయటకు వచ్చి జరిగిన ఘటననకు గ్రామస్థులు, కుటుంబ సభ్యులకు తెలిపాడు. వారు చెరువు వద్దకు చేరుకుని వెతకగా ఇద్దరి మృతదేహాలు కనిపించాయి. అమీర్ గ్రామంలోని బాషా, జలాల్‌బి దంపతులకు ఇద్దరు మగ పిల్లలు, ఒక కూతురు సంతానం కాగా చిన్న కొడుకు అమీర్ మృత్యువాత పడ్డాడు. గ్రామానికి చెందిన కర్రెప్ప, మార్తమ్మల దంపతులకు ఇద్దరు కుమారులు సంతానం కాగా దేవేంద్ర పెద్ద కుమారుడు. వీరి మరణంతో గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేస్తున్నారు.



# హంస వాహనంపై ఆది దేవుడు

- శ్రీగిరిపై వైభవంగా సాగుతున్న బ్రహ్మోత్సవాలు
- భారీగా తరలి వస్తున్న భక్తులు
- ఇరుముడి స్వాములకు ప్రత్యేక క్యూలైన్

**శ్రీశైలం, మార్చి 3:** ఇల కైలాసమైన శ్రీశైల క్షేత్రంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. మహా శివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడో రోజు ఆదివారం భ్రమరాంబ సమేత మల్లికార్జునుడు హంస వాహనంపై భక్తులకు దర్శనమిచ్చాడు. ముందుగా ఉభయ దేవాలయ ప్రాంగణంలోని అక్కమహాదేవి అలంకార మండపంలో ప్రత్యేక అలంకృతులైన స్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులను సుగంధ పుష్పాలతో ముస్తాబైన హంస వాహనంపై అధిష్టింపజేశారు. అనంతరం ఆలయ అర్చకులు, వేదపండితులు ప్రత్యేక పూజాదికాలు, హారతులు సమర్పించారు. స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను మంగళవాయిద్యాలు, కళాకారుల సంగీత, జానపద నృత్యాల నడుమ ఆలయం నుంచి వెలుపలకి తోడ్కొని వచ్చారు. అనంతరం ఆలయ రాజగోపురం గుండా గంగాధర మండపం చేరుకొని ప్రత్యేక పూజాదికాలు నిర్వహించి క్షేత్రపుర వీధుల్లో గ్రామోత్సవం జరిపారు. గ్రామోత్సవంలో విశేషంగా భక్తులు పాల్గొన్నారు. గ్రామోత్సవం ముందు కోలాటం, చెక్కభజన, రాజభటుల వేషాలు, జాంజ్ పథక్, జానపద పగటి వేషాలు, గొరవయ్యలు, బుట్టబొమ్మల నృత్యాలు, బీరప్పడోలు, తప్పెట్లు, డ్రమ్స్, భజంత్రీలు, బంజారా నృత్యం, చెంచు నృత్యం, శంఖానాదాలు మార్మోగాయి. ఆలయ రాజగోపురం నుంచి ప్రారంభమైన గ్రామోత్సవం గంగాధర మండపం మీదుగా నంది మండపం వరకు తిరిగి అక్కడి నుంచి బయలు వీరభద్రస్వామి ఆలయం దాకా కొనసాగింది. హంస వాహనంపై విహరించిన భ్రమరాంబ మల్లికార్జున స్వామిఅమ్మ వార్లను భక్తులు కనులారా దర్శించుకుని నీరాజనాలు సమర్పించారు.

### పట్టువస్త్రాల సమర్పణ

మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని భ్రమరాంబ మల్లికార్జున స్వామి, అమ్మవార్లకు ఆదివారం విజయవాడ ఇంద్రకీలాద్రి దుర్గామల్లేశ్వర స్వామిఅమ్మవార్ల దేవస్థానం తరఫున ఆలయ ధర్మకర్తల మండలి అధ్యక్షులు కె. రాంబాబు, కార్యనిర్వహణాధికారి కేఎస్ రామారావు, వేదపండితులు పట్టువస్త్రాలను సమర్పించారు. కార్యక్ర మంలో ముందుగా ఆలయ రాజగోపురం వద్ద సంప్రదాయాన్ని అను సరించి దర్మకర్తల మండలి అధ్యక్షులు రెడ్డివారి చక్రపాణిరెడ్డి, ఈవో డి. పెద్దిరాజు, అధికారులు, అర్చకులు, వేదపండితులు దుర్గామల్లేశ్వర స్వామిఅమ్మవార్ల దేవస్థానం అధికారులకు స్వాగతం పలికారు. తరువాత ఆలయ రాజగోపురం వద్ద పట్టువస్త్రాలకు ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం మేళతాళాలతో ఆలయ ప్రవేశం చేసి స్వామిఅమ్మవార్లకు సమర్పించారు.

### నేడు మయూర వాహన సేవ


శ్రీశైలంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం నాలుగో రోజు భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామివారికి మయూర వాహనసేవ, గ్రామోత్సవం నిర్వహిస్తారు. ఉదయం కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామివారి దేవస్థానం, సాయంకాలం తిరుమల తిరుపతి దేవస్థానం తరఫున స్వామిఅమ్మవార్లకు పట్టువస్త్రాలు సమర్పించనున్నారు.

### భక్తులతో కిక్కిరిసిన శ్రీగిరి

శ్రీశైల మల్లన్న బ్రహ్మోత్సవాలను తిలకించేందుకు భక్తులు భారీగా తరలి వస్తున్నారు. మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలకు రాష్ట్రం నుంచే కాకుండా వివిధ ప్రాంతాలు, రాష్ట్రాల నుంచి వేలాది మంది భక్తులు తరలి వస్తున్నారు. భక్తులతో శ్రీశైల క్షేత్ర పురవీధులన్నీ కిటకిటలాడుతున్నాయి. స్వామి, అమ్మవార్ల దర్శనం కోసం కంపార్ట్‌మెంట్లన్నీ భక్తులతో పూర్తిగా నిండిపోయాయి. అలాగే క్షేత్రంలోని అన్నదాన సత్రాలు, వసతి కేంద్రాలు భక్తుల సేవలో తరిస్తున్నాయి. బ్రహ్మోత్సవాలు ప్రారంభమై మూడు రోజులు గడుస్తున్న నేపథ్యంలో భక్తులు అధిక సంఖ్యలో శ్రీగిరి చేరుకొని మల్లన్న దర్శనానికి పోటెత్తారు. భక్తులకు దర్శనం కోసం ఉచిత క్యూలైన్, శీఘ్ర దర్శనం, అతి శీఘ్రదర్శనంతోపాటు జ్యోతిర్ముడి కలిగిన శివస్వాములకు ప్రత్యేక క్యూలైన్ ఏర్పాటు చేశారు. క్యూలైన్లన్ని భక్తులతో నిండిపోయాయి. స్వామివారి స్పర్శ దర్శనానికి భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని ఆలయ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

### భక్తిశ్రద్ధలతో ఇరుముడి సమర్పణ

మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని మండల, అర్థమండల దీక్షను స్వీకరించిన శివస్వాములు శ్రీశైలం మల్లన్న కు ఇరుముడులు సమర్పిస్తున్నారు. ముందుగా దేవస్థానం వారు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన క్యూ లైన్ల ద్వారా శివస్వా ము లు ఇరుముడులతో స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. అనంతరం శివదీక్షా శిబిరాలలో శాస్త్రోక్తంగా శివదీక్ష విరమిం చారు.



పాతాళగంగ వద్ద భక్తుల సందడి



కాలినడకన వెళ్తున్న భక్తులు





కంపార్టుమెంట్లలో శివస్వాములు

## కులమతాలకతీతంగా పోరాడాలి
### అన్నమయ్య కళాక్షేత్రం పీఠాధిపతి శంకర్‌స్వామిజీ

**కర్నూలు(న్యూసిటీ), మార్చి 3:** దేశంలో మతోన్మాదులను ఓడించడానికి లౌకికతత్వాన్ని కాపాడుకోవడానికి ప్రజలు కుల మతాలకు అతీతంగా ఐక్యమై పోరాటాలకు ముందుకు రావాలని అన్నమయ్య కళాక్షేత్రం పీఠాధిపతి, జయహో జాతీయ అధ్యక్షుడు శంకర్‌స్వామిజీ పిలుపునిచ్చారు. ఆదివారం నగరంలోని ఈడెన్ గార్డెన్‌లో సెక్యులర్ ఫోరం ఏర్పాటు చేసిన లౌకికతత్వం కాపాడుకుందాం-మతోన్మాదులను ఓడిద్దాం అనే అంశంపై జరిగిన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. బ్రిటిష్ పాలకులకు వ్యతిరేకంగా హిందువులు, ముస్లింలు కలిసి ఐక్యంగా పోరాటాలు చేశారని అన్నారు. ఆర్యసమాజ్ సభ్యుడు రాంప్రసాద్ బిస్మిల్, సాంప్రదాయ ముస్లిం అష్ఫఖుల్లా ఖాన్ ఇద్దరు కలిసి బ్రిటిష్ పాలకులను ఎదుర్కొన్నారని అన్నారు. మన రాజ్యాంగం భారతదేశాన్ని లౌకిక దేశంగా పేర్కొనప్పటికి నేటి పాలకులు దాన్ని దెబ్బతీసి మత రాజ్యంగా మార్చేస్తున్నారని అన్నారు. మైనార్టీలు, దళితులు, విద్యావంతులు, జర్నలిస్టులు, మహిళలపై మతశక్తులు దాడులు, దౌర్జన్యాలు చేస్తున్నాయని ఆరోపించారు. రాష్ట్రాల హక్కులను కేంద్రంలోని బీజేపీ ధ్వంసం చేస్తున్నదని అన్నారు. ఏపీలో బీజేపీ అంటే బాబు, జగన్, పవన్ అని ఎద్దేవా చేశారు. భారత రాజ్యాంగాన్ని, లౌకిక వ్యవస్థను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరికీ ఉందని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో నాయకులు అబ్దుల్ జబ్బార్, మౌలానా మునీర్ అహ్మద్, ఆవాజ్ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్ఎస్. సుభాన్, ఎక్బాల్ హుస్సేన్, నాసిర్, ప్రసాద్‌శర్మ పాల్గొన్నారు.

## సీపీఐ జిల్లా సమావేశాన్ని విజయవంతం చేయండి

**కోడుమూరు, మార్చి 3:** కోడుమూరు పట్టణంలో 6న జరిగే జిల్లా జనరల్ సమావేశాన్ని విజయవంతం చేయాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు క్రిష్ణ పిలుపునిచ్చారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాయలసీమలో వర్షాభావ పరిస్థితుల వలన పంటలు లేక వ్యవసాయ కూలీలు వలస బాట పట్టడంతో జనం లేక గ్రామీణ ప్రాంతాలు బోసిపోయాయని అన్నారు. అయితే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవసాయ కూలీల గూర్చి ఆలోచించడం లేదన్నారు. రాబోయే ఎన్నికల్లో బీజేపీ, వైసీపీకి తగిన గుణపాఠం చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని అన్నారు. 6న జరిగే సమావేశాన్నికి ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర, జిల్లా నాయకులు కోటేశ్వరరావు, వెంకట్రావు, ఆవుల శేఖర్, కేశవరెడ్డి, రసూల్ ముఖ్య అతిథిలుగా హాజరవుతున్నారని చెప్పారు. కార్యక్రమంలో సీపీఐ, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు శేషుకుమార్, రాముడు, రాజు తదితరులు పాల్గొన్నారు.

## 9న చలో అమరావతి

**కోడుమూరు, మార్చి 3:** వికలాంగుల మహాసభ గర్జనను చలో విజయవాడను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు ఆంధ్రయ్య పిలుపు నిచ్చారు. పట్టణంలో ఆదివారం మహా గర్జన కరపత్రాలను విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ వికలాంగులకు నెలకు రూ.6వేల పింఛన్ ఇవ్వాలని అన్నారు. అంతేగాకుండా అంత్యోదయ కార్డు, పంచాయతీ నుంచి పార్లమెంటు వరకు రాజకీయంగా 5శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. వికాలాంగుల హక్కుల సాధనకై 9న నిర్వహిస్తున్న మహాసభ గర్జనకు వికలాంగులకు పెద్ద ఎత్తున కదలి రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వికలాంగుల హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షులు సోమన్న, నాగశేషమ్మ, రంగన్న, సురేష్, ఎమ్మార్పీఎస్ నాయకులు రాజు, నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

## కార్మికులకు న్యాయం చేసే ఎమ్మెల్యేను ఎన్నుకోండి

**కర్నూలు(న్యూసిటీ), మార్చి 3:** రాబోయే ఎన్నికల్లో కార్మికులకు న్యాయం చేసే ఎమ్మెల్యేలను ఎన్నుకోవాలని సీపీఐ కార్యదర్శివర్గ సభ్యులు సీహెచ్.సాయిబాబ కార్మికులకు పిలుపునిచ్చారు. ఆదివారం కేకే భవన్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రస్తుత వైసీపీ పాలనలో కార్మికులు, ప్రజల గురించి పట్టించుకోలేదని అన్నారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన భారత న్యాయ సంహిత చట్టం 106.1-2 ద్వారా కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. కొద్దికాలం క్రితం ఓ ఎమ్మెల్యే సెన్సార్ కెమెరాల ద్వారా వచ్చిన చలానాలను తొలగించేలా చూస్తానని వాగ్దానం చేసి ఇప్పటి వరకు అమలు చేయకపోవడం దారుణమన్నారు. కార్మికులు, ప్రజల గురించి అసెంబ్లీలో ప్రస్తావించే ఎమ్మెల్యేలను ఎన్నుకోవాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో ఆటో యూనియన్ జిల్లా కార్యదర్శి ప్రభాకర్, నాయకులు షంషేర్‌భాష, డి.షేక్షావలి, ఎద్దుల రాజు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## పోలియో చుక్కలు వేయించండి

**కర్నూలు(న్యూసిటీ), మార్చి 3:** 5 సంవత్సరాలలోపు చిన్నారులకు పోలియో చుక్కలు తప్పనిసరిగ్గా వేయించాలని వి. రాంభూపాల్ చౌదరి ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు వై.రామేశ్వరరెడ్డి అన్నారు. ఆదివారం మాసామసీదు, మామిదాలపాడు అంగన్‌వాడీ కేంద్రాల్లో జరిగిన పల్స్‌పోలియో కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. ఆయన మాట్లాడుతూ ప్రతి సంవత్సరం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అత్యంత ప్రతిష్టాత్మకంగా కార్యక్రమం చేపట్టడం జరుగుతుందన్నారు. చిన్నారులకు పోలియో చుక్కలు వేయడం వల్ల భవిష్యత్తులో అంగవైకల్యం, ఇతర అనారోగ్య సమస్యలు రాకుండా కాపాడుకోవచ్చన్నారు. కార్యక్రమంలో స్టాఫ్ నర్సు నిరుపమ, మ టీచర్లు సుజాత, రాజ్యలక్ష్మి, సూపర్‌వైజర్ ఏ బాబ, ఆశా వర్కర్లు మరియమ్మ, సుహాసిని, సువర్ణమ్మ, నదియాభాను తదితరులు పాల్గొన్నారు.

● నగర పాలక సంస్థ కార్యాలయం ఆవరణలో పల్స్ పోలియో కార్యక్రమం నిర్వహించారు. మేనేజర్ చిన్నరాముడు అధ్వర్యంలో ఆరోగ్యసిబ్బంది సాయంత్రం వరకు సుమారు 60 మంది పిల్లలకు పల్స్ పోలియో చుక్కలు వేశారు. ఈ సందర్భంగా చిన్నరాముడు మాట్లాడుతూ తల్లిదండ్రులు 5 సంవత్సరాలలోపు పిల్లలకు తప్పకుండా పోలియో చుక్కలు వేయించాలని విజ్ఞప్తి చేశారు.

## జాతీయ స్థాయి యోగాలో జిల్లా వాసులు

**కర్నూలు(స్పోర్ట్స్), మార్చి 3:** యోగా ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో హర్యానా వేదికగా ఆన్‌లైన్ ద్వారా నిర్వహించిన జాతీయ స్థాయి యోగాలో ఉమ్మడి కర్నూలు జిల్లా నుంచి యోగా గురువులు మంచికంటి అవినాశ్ శెట్టి ఏగ్రేడ్, షేక్ ముంతాజ్ బేగం బి.గ్రేడ్, మునిస్వామి బి.గ్రేడ్, కొప్పుల కళ్యాణి సి.గ్రేడ్, షేక్ హసీనా బేగం సి.గ్రేడ్ సాధించారు. ఆదివారం స్థానిక డీఎస్ఏ ఔట్‌డోర్ స్టేడియంలో జాతీయ యోగా సంఘం సభ్యుడు శ్రీధర్ రెడ్డి వారిని ఘనంగా సన్మానించారు.

## మహిళలు సమాజ అభ్యున్నతిలో భాగం కావాలి
### - నరసం జిల్లా అధ్యక్షురాలు సుబ్బలక్ష్మమ్మ

**కర్నూలు(కల్చరల్), మార్చి 3:** విద్యావంతులైన మహిళలు, రచయిత్రులు, కవయిత్రులు సమాజ అభ్యున్నతిలో భాగస్వాములు కావాలని, కవయిత్రులు రచనలతో సరిపెట్టకుండా తోటి మహిళల పురోగతికి ఉపయోగపడాలని నవ్యాంధ్ర రాష్ట్ర రచయిత్రుల సంఘం (నరసం) జిల్లా అధ్యక్షురాలు సుబ్బలక్ష్మమ్మ మహిళలకు పిలుపునిచ్చారు. ఆదివారం నగరంలోని మద్దూరు నగర్‌లోగల పింగళి సూరన తెలుగు తోటలో మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. నరసం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన సుబ్బలక్ష్మమ్మ మహిళలను ఉద్దేశించి మాట్లాడుతూ సమాజంలో పుట్టుక నుంచి మరణం వరకు మహిళలపట్ల చిన్నచూపు ఉందని, దాన్ని రూపుమాపేందుకు విద్యావంతులైన వారు మహిళా చైతన్య కార్యక్రమాలతో ముందుకు పోవాలని కోరారు. నరసం ప్రధాన కార్యదర్శి డాక్టర్ దండెబోయిన పార్వతీదేవి మాట్లాడుతూ మన కోసం మనం...సమాజ శ్రేయస్సుకు మనం అన్న నినాదంతో మహిళలంతా సంఘటితంగా సమస్యలపై పోరాటాలు చేయాలని కోరారు. ఐద్వా జిల్లా కార్యదర్శి అలివేలమ్మ మాట్లాడుతూ శ్రామిక మహిళల కృషితో అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఏర్పడిందని అన్నారు. ఈ కార్యక్రమానికి ముందు తెలుగుతోటలోని పింగళి సూరన విగ్రహానికి, మహిళా నేతలు సావిత్రిబాయి పూలే, దుర్గాబాయి దేశ్‌ముఖ్, ఇటీవల దివంగతులైన కవయిత్రి చక్కిలం విజయలక్ష్మి చిత్రపటాలకు పుష్పమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం 'నవనారీ కవన విజయం' అనే రూపకం ప్రదర్శించారు. కార్యక్రమంలో కవయిత్రులు చంద్రమౌళిని, నీలిమ, లీలావతి, మాసుంబి, సుబ్బలక్ష్మి, సునీత, కల్యాణి తదితరులు పాల్గొన్నారు.


నీరు లేని కోనేరు

# ఎండిపోయిన బుగ్గ

### ఇంకిపోయిన నీటి బుగ్గలు



ఒకప్పుడు కాల్వబుగ్గ క్షేత్రంలో నీటి బుడగలు ఉండేవి. ఎంతో అందంగా ఈ ప్రదేశం ఉండేది. ఆరేళ్ల నుంచి నీరు కరువైంది.

- నాగరాజు, భక్తుడు

### ఇబ్బందిపడుతున్నారు



గతంలో హుశేనాపురం నుంచి కాలినడకన వెళ్లి కోనేర్లలో స్నానాలచరించే వారం. రానురాను కాల్వబుగ్గలో నీరు కరువయ్యాయి. వీటితో పాటు భక్తులు కూడా ఇబ్బందులు పడుతున్నాం.

- సుధాకర్, కాల్వబుగ్గ మాజీ చైర్మన్, హుశేనాపురం

### ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నాం



కాల్వబుగ్గలో భూగర్భ జలాలు ఇంకిపోవడంతో చిన్న కోనేటికి బోరు ద్వారా నీరు సరఫరా చేస్తున్నాం. అలాగే పెద్ద కోనేరు కూడా ఎండిపోయింది. శివరాత్రికి ప్రత్యామ్నాయ చర్యలు తీసుకుంటాం.

- డీఆర్‌కేవీ ప్రసాద్, ఈవో

● రామేశ్వరం నీరు లేని కాల్వబుగ్గ
● బోర్ల నీటితో కింద కోనేరులోకి నీటి సరఫరా
● ఇబ్బందులు పడుతున్న భక్తులు


బుగ్గ రామేశ్వరస్వామి ఆలయం ఇదే

**ఓర్వకల్లు, మార్చి 3: కాల్వబుగ్గ రామేశ్వరంలోని ఆకర్షణ అంతా కోనేరులే. అక్కడి జల ధారలనుబట్టే ఆ క్షేత్రానికి కాల్వబుగ్గ అనే పేరు వచ్చింది. ఇదంతా గతంగా మారిపోయింది. రెండు ఎర్రటి కొండల నడుమ పచ్చని వృక్షాల సెలయేటి గలగలలతో, పక్షుల కిలకిలారావాలతో వందల యేళ్ల నుంచి విలసిల్లుతున్న కాల్వబుగ్గ ఎండిపోయింది. ఇక్కడి భూగర్భజలాలు అడుగంటిపోయాయి. దాదాపు 200 ఏళ్ల నుంచి కొనసాగుతున్న కాల్వబుగ్గ సౌందర్యమంతా క్షీణించిపోతున్నది. ఆరేళ్ల నుంచి అనేక పర్యావరణ సమస్యల వల్ల కాల్వబుగ్గ జలధారలు ఒట్టిపోయి చిన్న కోనేరు ఎండిపోయింది. పెద్ద కోనేరులో నీరు లేక పాచిపట్టింది.**

మండల పరిధిలోని కాల్వబుగ్గ రామేశ్వర స్వామి క్షేత్రం సుప్రసిద్ధమైనది. ఇది ప్రశాంతతకు, ఆధ్యాత్మికతకు, ప్రకృతి సౌందర్యానికి నెలవు. శుభకార్యాలు జరుపుకునేందుకు అనువైన ప్రాంతం కావడంతో ఇక్కడ ఓ శివాలయాన్ని కట్టించారు. నీరు ఉబికివచ్చే ప్రాంతంలో కోనేర్లు నిర్మించారు. చిన్న కోనేరు, పెద్ద కోనేరు వాగు వెంట గ్రామాలకు, పంట పొలాలకు కూడా నీరు అందేది. అలాంటి జలధార ఎండిపోవడంతో చిన్న కోనేరుకు బోరు నీరు నింపాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీని కోసం చిన్న కోనేరు సమీపంలో రెండు బోర్లు వేశారు. వాటిలో కూడా నీరు అంతంత మాత్రమే. అరకొర నీటినే పైపులైన్ ద్వారా చిన్న కోనేటికి వదులుతున్నారు. దీంతో స్నానాలు చేసేందుకు నీరు లేక భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఒకప్పుడు కాల్వబుగ్గ నుంచి వచ్చే నీరు హుశేనాపురం, కాల్వ గ్రామాలకు చెందిన 300 ఎకరాలను సాగు చేయడానికి ఉపయోగపడేది. ఏడు గ్రామాలకు తాగునీరు కూడా అందేది. ప్రస్తుతం నీరు లేకపోవడంతో ఆ పొలాలు బీడుగా మారాయి. వర్షాలు ఉన్నా భూగర్భ జలాలు ఇంకిపోయాయి. పెద్ద కోనేటిలో నీరు పాచిపట్టిపోయాయి. కాల్వబుగ్గ రామలింగేశ్వరస్వామి క్షేత్రంలో ప్రతి యేటా కొన్ని వందల వివాహాలు జరుగుతాయి. వేల సంఖ్యలో భక్తులు, పర్యాటకులు వస్తుంటారు. ఫిబ్రవరి 17 నుంచి 22వ తేదీ వరకు మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా భక్తులకు నీటి కష్టాలను తీర్చేందుకు ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టేందుకు అధికారులు సిద్ధమయ్యారు. గత ఆరేళ్లుగా వర్షం వస్తేనే కోనేర్లలో నీరు. ఎండాకాలమంతా కోనేర్లు ఒట్టిపోయి కనిపిస్తున్నాయి.

## వైసీపీని ఓడించండి: విష్ణు

**కర్నూలు(రూరల్), మార్చి3:** మరో రెండు నెలల్లో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో కోడుమూరు నియోజకవర్గం యందు వైసీపీని చిత్తుచిత్తుగా ఓడించాలని టీడీపీ సీనియర్ నేత ఎదురూరు విష్ణువర్ధన్‌రెడ్డి ప్రజలకు పిలుపునిచ్చారు. కర్నూలులో ఆయన నివాసంలో కోడుమూరు మండలం అనుగొండ గ్రామానికి చెందిన దాదాపు వంద వైసీపీ కుటుంబాల కీలక నాయకులు ఆదివారం విష్ణువర్ధన్‌రెడ్డి, బొగ్గుల దస్తగిరి సమక్షంలో టీడీపీలో చేరారు. వారికి విష్ణు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా విష్ణు మాట్లాడుతూ టీడీపీ అభ్యర్థి బొగ్గుల దస్తగిరి గెలుపునకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. వైసీపీ నుంచి టీడీపీలో చేరినవారిలో రామకృష్ణారెడ్డి, సర్వేశ్వరరెడ్డి, మధురెడ్డి, బసిరెడ్డి రామచంద్రరెడ్డి, బసిరెడ్డి హనుమంతరెడ్డి, వార్డు సభ్యుడు పాండురెడ్డి, శివారెడ్డి, బలిజ జగ్గయ్య, అల్లిసనప్ప, బోయ నాగమద్దయ్య, బోయ హనుమంతు, బోయ వెంకట్రాముడు, వెంకన్న, సుధాకర్, శ్రీరాములు, కురవ గిడ్డయ్య శేషన్న, భాస్కర్‌తో పాటు మరికొంతమంది చేరారు.

● గూడూరు మండలం జూలకల్లు గ్రామానికి చెందిన బొజ్జన్న, మాదన్న, లక్ష్మన్న, చిన్నలక్ష్మన్న, మద్దిలేటి, శ్రీనివాసులు, బజారి, మిన్నెల్లా, ఆంజనేయులు, పెద్దరాముడు, మద్దిలేటితోపాటు మరికొంతమంది విష్ణువర్ధన్‌రెడ్డిని కలిసి ఆయన నాయకత్వంలో పని చేస్తామని వెల్లడించారు. వారితోపాటు పొన్నకల్లు మిన్నప్ప, కురువ రాముడు, జ్యోతీశ్వరుడు, లింగన్న నాగన్న హనుమంతు టీడీపీకి మద్దతు తెలుపుతున్నట్లు ప్రకటించారు.

● గూడురు నగర పంచాయతీకి చెందిన కళ్యాణ్, వీరేష్, లోకేష్, నరసింహ, పరమేష్‌తోపాటు మరికొంత మంది విష్ణువర్ధన్‌రెడ్డిని కలిసి బొగ్గుల దస్తగిరి గెలుపునకు కృషి చేస్తామని తెలిపారు.

● సీ బెళగల్ మండలం ముడుమాల గ్రామానికి చెందిన ఆర్.పౌలు ఆధ్వర్యంలో పలువురు వైసీపీకి చెందిన నాయకులు, కార్యకర్తలు తెలుగుదేశం పార్టీలో చేరారు. ఆదివారం కర్నూలులో ఎదురూరు విష్ణువర్ధన్‌రెడ్డి స్వగృహంలో ముడుమాల గ్రామానికి చెందిన సుమారు 200 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరాయి.. చేరిన వారిలో విజయ్, రాజు, నాగరాజు, అజయ్, మాదన్న, కొండల్, సామేలు, సుంకన్న, హనుమంతు, మద్దిలేటి, తుమ్మల మద్దిలేటి, రోగోడు, అనంతకుమార్, శ్రీనివాసులు, నరసింహులు, సుంకన్న, కమ్మరి మహేష్, మద్దిలేటి, చాకలి దుబ్బన్న ఉన్నారు. కార్యక్రమంలో రామిరెడ్డి, మాజీ జడ్పీటీసీ చంద్రశేఖర్ ఉన్నారు.


వైసీపీ నుంచి టీడీపీలో చేరిన అనుగొండ గ్రామస్థులు

**గూడూరు:** రాష్ట్రంలో టీడీపీ గెలుపును ఎవరూ ఆపలేరని కోడుమూరు నియోజక టీడీపీ అభ్యర్థి బొగ్గుల దస్తగిరి అన్నారు. ఆదివారం గూడూరు మండలంలోని గుడిపాడు గ్రామంలో ప్రచారంలో భాగంగా ఇంటింటికి వెళ్ళి సూపర్ సిక్స్ పథకలను వివరించి తనను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గుడిపాడు మహేశ్వర రెడ్డి, నగర పంచాయతీ మాజీ వైస్‌చైర్మన్ రామాంజనేయులు, మాజీ మండల టీడీపీ కన్వీనర్ జె సురేష్, కె కృష్ణ, గోపాల్ రెడ్డి, రేమట వెంకటేష్, పౌలు, కౌన్సిలర్లు బుడ్డంగలి, కోడుమూరు షాషావళి, విజయ్ కుమార్, కె ఎం రవి తదితరులు పాల్గొన్నారు.

## చంద్రబాబుతోనే రాష్ట్ర భవిష్యత్తు: గౌరు

**కల్లూరు, మార్చి 3:** నారా చంద్రబాబునాయుడుతోనే రాష్ట్ర ప్రజల భవిష్యత్తుకు గ్యారెంటీ సాధ్యమని పాణ్యం టీడీపీ అభ్యర్థి గౌరు చరిత నందికొట్కూరు టీడీపీ ఇన్‌చార్జి గౌరు వెంకటరెడ్డి అన్నారు. ఆదివారం 20వ వార్డు మారుతీ మెగా సిటీ, 21వ వార్డు కిసాన్ నగర్‌లలో ఆమె బాబు ష్యూరిటీ..భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో పాల్గొని ఇంటింటికీ తిరిగి సమస్యలను తెలుసుకుని ఎన్నికల మేనిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేశారు. గౌరుచరిత మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ ప్రభుత్వ హయాంలోనే అభివృద్ధి, సంక్షేమం అన్నివర్గాల ప్రజలకు అందజేశామని తెలిపారు. టీడీపీ ప్రవేశపెట్టిన ఆరు పథకాలను ప్రవేశపెట్టారని మహిళలు, నిరుద్యోగులు, రైతులు, బీసీల సాధికారతకు పెద్దపీట వేశారన్నారు. వైసీపీ 57 నెలల పాలనలో అరాచకం, అవినీతి, అక్రమ కేసులతో రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించారన్నారు. రానున్న ఎన్నికల్లో జగన్‌రెడ్డికి దిమ్మతిరిగే ఫలితాలు రానున్నాయని, ప్రభుత్వ వ్యతిరేకతను ప్రజలకు వివరించాలన్నారు. కార్యక్రమంలో కల్లూరు అర్బన్ కన్వీనర్ పెరుగు పురుసోత్తంరెడ్డి, ప్రభాకర్‌యాదవ్, బ్రాహ్మణపల్లె నాగిరెడ్డి, రాఘవేంద్రారెడ్డి, పల్లె రఘునాథ్‌రెడి పాల్గొన్నారు.

● **టీడీపీలో చేరిక:** కల్లూరు అర్బన్ 27, 29వ వార్డులకు చెందిన వైసీపీ నాయకులు పాణ్యం టీడీపీ అభ్యర్థి గౌరుచరిత దంపతుల సమక్షంలో టీడీపీలో చేరారు. ఆదివారం స్థానిక మాదవీనగర్‌లోని గౌరు స్వగృహంలో కల్లూరు అర్బన్ కన్వీనర్ పెరుగు పురుషోత్తంరెడ్డి ఆధ్వర్యంలో 50 మంది వైసీపీని వీడి టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. పార్టీలో చేరిన వారిలో రాజు, విజయ్, పవన్, నరేష్, రవి, దస్తగిరి, వెంకట్, మధు, ఈశ్వర్, వెంకటేష్, షేక్షా, అబ్దుల్, మౌలాలి సుమంత్, మణికంఠ తదితరులు పాల్గొన్నారు.


21వ వార్డు గ్యారెంటీ కరపత్రాలను ప్రజలకు అందజేస్తున్న గౌరు చరిత

● **బొల్లవరంలో:** బొల్లవరం గ్రామంలో మండల కన్వీనర్ డి.రామాంజనేయులు ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ...భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఆదివారం గ్రామంలో పర్యటించి శంఖారావం, బాబు ష్యూరిటీపై అవగాహన కల్పించి, ఎన్నికల మ్యానిఫేస్టో కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో విజయ్‌కుమార్, మస్తాన్‌నాయుడు, లక్ష్మన్న, జానకిరాముడు, మధు, సురేంద్ర, పివి.రమణారెడ్డి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## మహిళల భాగస్వామ్యం పెరగాలి
### ● నగరంలో ఉమెన్ డాక్టర్లు మార్నింగ్ వాక్

**కర్నూలు(హాస్పిటల్), మార్చి 3:** రాజకీయం, విద్య, ఇతర రంగాల్లో మహిళల భాగస్వామ్యం పెరగాలని ఐఎంఏ ఉమెన్ డాక్టర్ల అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు డా.కే.మాధవి శ్యామల, డా.విష్ణుప్రియ, కోశాధికారి డా.లక్ష్మీభాయి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఐఎంఏ మహిళా వైద్యులు ఆదివారం ఉదయం నగరంలో రాజ్‌విహార్ సెంటరు నుంచి కొండారెడ్డి బురుజు వరకు మార్నింగ్‌వాక్ నిర్వహించారు. ఈ వాక్‌లో జిల్లా సహకార కేంద్ర బ్యాంకు అధ్యక్షురాలు ఎస్వీ విజయమనోహరి, మహిళా వైద్యులు పాల్గొన్నారు. ఉమెన్ డాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు మాట్లాడుతూ అంతర్జాతీయ మహిలా దినోత్సవం 112 వసంతాలు పూర్తి చేసుకుందని, తాము ఇంటికే పరిమితం కాదంటూ పురుషులకు ధీటుగా విజయాలు సాధిస్తున్నామన్నారు. ఆకాశంలో సగంతో పాటు అవకాశాల్లో కూడా సగభాగం తీసుకుంటామన్నారు.


కొండారెడ్డి బురుజు వద్ద మార్నింగ్ వాక్ చేస్తున్న మహిళా వైద్యురాలు

అనంతరం నగరంలోని పార్థసారధి నగర్‌లోని ఐఎంఏ భవన్‌లో మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. సీనియర్ మహిళ వైద్యులను సన్మానించారు. రిటైర్డు డీఎంహెచ్‌వో నిరూపమ ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. కార్యక్రమంలో డిప్యూటీ సీఎస్ఆర్ఎంవో హేమనళిని, వైస్ ప్రిన్సిపాల్ డా.రేణుకాదేవి, ప్లాస్టిక్ సర్జరీ ప్రొఫెసర్ డా.మంజులాబాయి, డా.సుహాసిని, డా.పార్వతిదేవి, డా.విజయలక్ష్మి, డా.నేహ సుధాకర్, డా.వినీషారెడ్డి మహిళా వైద్యులు పాల్గొన్నారు.

## 'పేద విద్యార్థులకు సేవలు అభినందనీయం'

**కర్నూలు(కల్చరల్), మార్చి 3:** జిల్లాలోని నిరుపేద విద్యార్థులకు గత ముప్పయ్ ఏళ్లుగా వసతి, చదవు అందిస్తున్న సేవా భారతి వారి అన్నపూర్ణమ్మ విద్యార్థి వసతి గృహం సేవలు ఎంతో స్ఫూర్తిదాయకంగా నిలుస్తాయని ఆర్ఎస్ఎస్ ప్రాంత సహ బౌద్ధిక్ ప్రముఖ్ మాలపాటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఆదివారం రాత్రి నగరంలోని చిదంబరరావు వీధిలో అన్నపూర్ణమ్మ విద్యార్థి వసతి గృహం 30వ వార్షికోత్సవ వేడుకలను, అదే వీధిలోని శ్రీస్వామి వివేకానంద సంస్కృత పాఠశాల ఆవరణలో ఘనంగా నిర్వహించారు. నగరానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త ఇల్లూరు రంగస్వామి అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో వసతిగృహ అధ్యక్షుడు బైరెడ్డి చిరంజీవిరెడ్డి ఆవాస వివరాలు తెలియజేశారు.

## మిరపకు నిప్పు

**సి. బెళగల్, మార్చి 3:** మండలంలోని పోలకల్లు గ్రామానికి చెందిన ఉల్లెక్కిగాళ్ళ గుండ్రాయి అనే రైతు మిరప పంటకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. ఈ ఘటన ఆదివారం జరిగింది. ఈ రైతు మూడు ఎకరాల పొలాన్ని కౌలుకు తీసుకుని బ్యాడిగి రకం మిరప పంటను సాగు చేశాడు. మధ్యరాత్రి ఇంటి నుంచి పొలానికి వచ్చి చూడగా మిరపకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో తగలబడిపోతూ కనిపించింది. చేతికి వచ్చిన మిరపకు మంచి ధర వస్తే అమ్ముకుందామన్న ఆశ అడియాశ అయింది. రైతుకు దాదాపు రూ 3 లక్షలకు పైగా నష్టం జరిగింది. ఎస్ఐ తిమ్మారెడ్డి కాలి బూడిద అయిన మిరపను పరిశీలించారు.

## టీడీపీ విజయం కోసం ప్రతి ఒక్కరూ కష్టపడాలి


టీజీ భరత్ సమక్షంలో టీడీపీలో చేరిన బంగారు పేట వైసీపీ నాయకులు

**కర్నూలు(అర్బన్), మార్చి 3:** తెలుగుదేశం పార్టీ విజయం కోసం ప్రతి ఒక్కరు కష్టపడాలని టీడీపీ కర్నూలు నియోజకవర్గం ఇన్‌చార్జీ టీజీ భరత్ అన్నారు. ఆదివారం నగరలోని మౌర్యఇన్‌లో బంగారుపేటకు చెందిన వైసీపీ నాయకుడు ఏలియా ఆధ్వర్యంలో యువకులు, మహిళలు పలువురు టీడీపీలో చేరారు. టీజీ భరత్ మాట్లాడుతూ టీడీపీకి ప్రజల్లో ఆదరణ పెరుగుతుందన్నారు. పార్టీలో చేరిన ప్రతి నాయకుడు, కార్యకర్త విజయం కోసం పని చేయాలని కోరారు. కర్నూలుకు వైసీపీ ప్రభుత్వం ఏమి చేయలేదన్నారు. టీడీపీ అధికారంలోకి రాగానే కర్నూలు నగరాన్ని అభివృద్ధి చేస్తామని అన్నారు పార్టీలో చేరిన వారిలో రవి, ప్రభాకర్, ప్రభావతి, దేవదానం, మహేష్, ప్రభావతి, నాగలక్ష్మి, మంజుల, దానమ్మ, శివమ్మ తదితరులు పాల్గొన్నారు.,

## నాయీబ్రహ్మణ సాధికార సమితి మహిళా అధ్యక్షురాలిగా గుడిపాడు నాగేశ్వరమ్మ



**కర్నూలు(అర్బన్), మార్చి 3:** తెలుగుదేశం పార్టీ నాయి బ్రహ్మణ సాధికార సమితి కర్నూలు నియోజకవర్గం మహిళా అధ్యక్షురాలిగా గుడిపాడు నాగేశ్వరమ్మ ను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నాయి బ్రహ్మణ సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ వైద్యం శాంతారామ్ నియమించారు. ఆదివారం నగరంలోని టీడీపీ కార్యలయం వద్ద మాట్లాడుతూ తనపై నమ్మకంతో అప్పగించిన ఈబాధ్యతలను వమ్ము చేయకుండా పూర్తిగా న్యాయం చేయడానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు.

## తైక్వాండో మహిళా క్రీడాకారిణులకు సన్మానం

**కర్నూలు(స్పోర్ట్స్), మార్చి 3:** స్థానిక లక్ష్మీనరసింహ స్వామి కళ్యాణమండపంలో ప్రపంచ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మహిళా తైక్వాండో క్రీడాకారిణులను ఆదివారం సీనియర్ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డా.బి.శంకర్‌శర్మ సన్మానించారు. డాక్టర్ మాట్లాడుతూ ఏ రంగంలో అయినా మహిళలు పురుషులకు తీసిపోని విధంగా అవకాశాలు ఉన్నాయన్నారు. అనంతరం తైక్వాండో పోటీలను ప్రారంభించారు.. కార్యక్రమంలో శిక్షకుడు వెంకటేశ్ పాల్గొన్నారు.

## గీతాంజలి నర్సింగ్ కాలేజీ విద్యార్థుల విజయభేరి

**కర్నూలు(హాస్పిటల్), మార్చి 3:** హెల్త్ యూనివర్సిటీ విజయవాడ ప్రకటించిన 2023 బ్యాచ్ బీఎస్సీ నర్సింగ్ 2వ సెమిస్టర్ పరీక్ష ఫలితాల్లో గీతాంజలి నర్సింగ్ కళాశాల విద్యార్థులు విజయభేరి మోగించారు. నగరంలోని గాయత్రీ ఎస్టేట్స్ నందలి గీతాంజలి నర్సింగ్ కలాశాల విద్యార్థులు 49 మంది పరీక్షలకు హాజరు కాగా, అందులో 11 మంది డిస్టింక్షన్‌సలో, 22 మంది ఫస్ట్ క్లాస్‌లో, 7 మంది సెకండ్ క్లాస్‌లో ఉత్తీర్ణత సాధించినట్లు కళాశాల కర్సాండెంట్ పెరుగు విజయవర్దన్ రెడ్డి తెలిపారు. పి.శ్రీలేఖ 88 శాతంతో కళాశాల టాపర్‌గా నిలిచింది. ఉత్తీర్ణులైన విద్యార్థులకు కళాశాల కరస్పాండెంట్ పెరుగు విజయవర్దన్ రెడ్డి, ప్రిన్సిపాల్ వసంత కుమార్ అభినందనలు తెలిపారు.

## 'రంగముని సేవలు చిరస్మరణీయం'

**కర్నూలు(కల్చరల్), మార్చి 3:** జిల్లాలో పద్య నాటక రంగానికి గురవుగా ఉంటూ కళారంగానికి దివంగత కళాకారుడు రంగముని అందిచిన సేవలు చిరస్మరణీయమని టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య కొనియాడారు. ఆదివారం రాత్రి టీజీవీ కళాక్షేత్రంలో ప్రముఖ రంగస్థల కళాకారుడు రంగముని 7వ వర్ధంతి సభ, సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు నిర్వహించారు. తొలుత రంగముని చిత్ర పటానికి పుష్పమాలలు వేసి కళాకారులు నివాళులు అర్పించారు. సంగీత గురువులు బాలు, అనితలను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సాహితీ స్రవంతి గౌరవాధ్యక్షుడు ఎంపీ బసవరాజు, కన్వీనర్ జేఎస్ శేషయ్య, బీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు నక్కలమిట్ట శ్రీనివాసులు, జీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్ కైక, మురళీకృష్ణ, బంగి శ్రీధర్ పాల్గొనగా, కార్యక్రమానికి వెంకటరమణ, మధు స్వాగతం పలికారు. అంతకుముందు స్వరదాసరి సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో శాస్త్రీయ నృత్య ప్రదర్శనల్లో పలువురు బాల కళాకారులు తమ ప్రతిభను చాటుతూ నృత్య, సంగీత ప్రదర్శనలతో ఆహుతులను అలరింపజేశారు.

## అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి

**ఓర్వకల్లు, మార్చి 3:** మండలంలోని గుమితం తండా పవర్ ప్రాజెక్టులో పని చేస్తున్న బోరెల్లి వేణు (22) అనుమానాస్పద స్థితిలో ఆదివారం మృతి చెందాడు. నంద్యాల జిల్లా నందికొట్కూరు మండలం కోనేటమ్మతల్లి గ్రామానికి చెందిన మృతుడు బోరెల్లి వేణు గుమితం తండా గ్రామం సమీపాన గల పవర్ ప్రాజెక్టులో పని చేస్తున్నాడు. మృతుడు విశ్రాంతి గదిలో చనిపోయి కనిపించాడని, కారణాలు తెలియాల్సి ఉందని ఓర్వకల్లు ఎస్ఐ రాజారెడ్డి తెలిపారు. మృతుని తండ్రి గోకారి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.





# టీడీపీతోనే దళితుల అభివృద్ధి

- జగన్ అధికారి మదాన్ని దించాలి
- జనసేన, టీడీపీ అభ్యర్థులను గెలిపించుకుందాం
- ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఎంఎస్ రాజు

**కర్నూలు(అర్బన్), మార్చి 3:** తెలుగుదేశం పార్టీతోనే దళితుల అభివృద్ధి, సామాజిక న్యాయం సాధ్యమని ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఎంఎస్ రాజు అన్నారు. ఆదివారం కర్నూలు నగరంలోని ఎంఆర్సీ ఫంక్షన్ హాలులో నంద్యాల, కర్నూలు జిల్లాల మహా గర్జన సభ జరిగింది. భారీ ఎత్తున దళితులు తరలి వచ్చిన సభకు జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బీటీ నాయుడు ఆధ్వర్యంలో జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు ధరూర్ జేమ్స్ అధ్యక్షతన సదస్సు జరిగింది. అంతక ముందు ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళితులు తమకు జరిగిన అన్యాయానికిగాను ఈ ఎన్నికల్లోజగనోహ్మన్‌రెడ్డి మదాన్ని దించేందుకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. దళిత యువకుడిని వైసీపీ ఎమ్మెల్సీ చంపి డోర్ డెలివరీ చేస్తే చర్యలు తీసుకోలేదని అన్నారు. ఇసుక దందాను అడ్డుకున్న మరో దళితుడిని శిరోముండనం చేశారని, డాక్టర్ సుధాకర్‌ను హింసించి చంపిన లాంటి ఘటనతోపాటు దాదాపు ఆరు వేల మంది దళితులు దాడులకు గురయ్యారని, వేల మంది మహిళలపైన అత్యాచారాలు జరిగాయని తెలిపారు. తిరుపతి ఎంపీ బల్లి దుర్గాప్రసాద్ మరణిస్తే ఏడు నెలలు ఆ కుటుంబాన్ని పరామర్శించిన పాపాన పోలేదని అన్నారు. ఎస్సీ, ఎస్టీ చట్టాన్ని రద్దు చేయాలని గత కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో నిర్ణయం తీసుకుంటే దేశ వ్యాప్తంగా చేసిన ఆందోళనల్లో 11 మంది మరణించారని తెలిపారు. అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆసెంబ్లీలో తీర్మానం చేసి ఎస్సీలకు రక్షణ చట్టం ఉండాల్సిందేనని కేంద్రానికి నివేదిక పంపిన మొదటి సీఎం అని గుర్తు చేశారు. దళితులు సాగులో ఉన్న 11 వేల ఎకరాలను లాక్కున్న దుర్మార్గుడు ముఖ్యమంత్రి అని ధ్వజమెత్తారు. నియోజవర్గాల ఇన్‌చార్జిలు టీజీ భరత్, జయనాగేశ్వరరెడ్డి, మీనాక్షి నాయుడు, గొగ్గుల దస్తగిరితోపాటు జనసేన నాయకులు పాల్గొన్నారు.

### ఓటు హక్కుతో బుద్ధి చెప్పాలి



విభజించు, పాలించు తీరు జగన్‌ది. కులాలు, మతాలు, ప్రాంతాల మధ్య చిచ్చు పెడుతున్నారు. సీఎం జగన్మోహన్‌రెడ్డికి ఓటు హక్కుతో దళితులు బుద్ధి చెప్పాలి. ఆనాడు పటేల్ వ్యవస్థను రూపు మాపి దళితులకు అన్ని రంగాల్లో స్వేచ్ఛను ప్రసాదించిన మహనీయుడు నందమూరి తారక రామారావు, స్ఫూర్తితో చంద్రబాబు, నారా లోకేశ్ నాయకత్వంలో పార్టీ అన్ని వర్గాలను ఆదుకునేందుకు ఆవిర్భవించిన టీడీపీని గెలిపించుకోవాలంటే దళితులంతా ఆలోచించి ఓటు వేయాలి., దళిత ద్రోహి జగన్‌రెడ్డికి రానున్న ఎన్నికల్లో అత్యధిక మెజార్టీతో 14 ఎమ్మెల్యేలు, ఇద్దరు ఎంపీ స్థానాల్లో టీడీపీ అభ్యర్థులను గెలిపించుకుందాం.

- బీటీ నాయుడు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు

### దళిత ద్రోహి జగన్‌రెడ్డి



దళిత ద్రోహి జగన్‌రెడ్డి, దళితుల అభివృద్ధి ఒక్క చంద్రబాబుతోనే సాధ్యమని దళిత సోదరులు ఇప్పటికే గుర్తించారు. అందుకే ఎక్కడ చంద్రబాబు, లోకేశ్, సభలు పెట్టినా ప్రజలు స్వచ్ఛందంగా తరలి వస్తున్నారు. జగన్‌రెడ్డి ఐదేళ్ల పాలనలో దళిత సంక్షేమం పూర్తిగా పడకేసింది. నవరత్నాల పేరుతో కార్పొరేషన్‌లను నిర్వీర్యం చేశారు. జిల్లాలో దళితులంతా జగన్ అరాచకాలపై విసుగు చెందారు. ఎన్నికల కోసం ఎదురు చూస్తున్నారు. ఓటు అనే ఆయుధంతో తగిన బుద్ధి చెబుతారు.

- ధరూర్ జేమ్స్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు

### దళిత జేఏసీ చైతన్యం చేస్తోంది



కర్నూలు నగరంలో దళిత జేఏసీ నాయకులు వాడ వాడలో చైతన్యం తెస్తున్నారు. అమరావతిలో 15 మండలాల్లో దళితులు ఉన్నారు. అక్కడ ఎక్కువ శాతం నష్టపోయింది దళితులే. మూడు రాజధానులంటూ రుషికొండలో ఫైవ్ స్టార్ హోటల్ కట్టారు. వైఎస్సార్ పార్టీ మళ్లీ అధికారంలోకి వస్తే డోర్ డెలివరీ చేస్తారు. జాగ్రత్త.. వచ్చే ఎన్నికల్లో టీడీపీని గెలిపించుకోవాలి.

- టీజీ భరత్, కర్నూలు ఇన్‌చార్జి

### జగన్‌ను ఇంటికి పంపుదాం




దళితుల కోసం ఏర్పాటు చేసిన కార్పొరేషన్లను నవరత్నాల పేరుతో నిర్వీర్యం చేశాడు. రాష్ట్రంలో దారుణమైన పరిస్థితి ఉంది. ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టరు పోస్టులు ఏర్పాటు చేసి రూ. 1500 కోట్లు కాజేశాడు.

- బొగ్గుల దస్తగిరి, కోడుమూరు ఇన్‌చార్జి



### అరాచకాలు గుర్తుంచుకోవాలి



దళితులు, బడుగుల పట్ల ఎన్నో అరాచకాలు చేసిన జగన్మోహన్‌రెడ్డిని గద్దె దించకపోతే ఎంతో నష్టపోతాం. ఎస్సీలపైనే ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసులు పెట్టిన మహానుభావుడు జగన్‌రెడ్డి. ఎస్సీ సబ్ ప్లాన్‌కు గుండు కొట్టించాడు. ఏ ఒక్క మచ్చలేని చంద్రబాబును జైలుకు పంపించాడు. జగన్ అరాచకాలను గుర్తుంచుకొని ఎన్నికల్లో వ్యవహరించాలి.

- బీవీ జయనాగేశ్వరరెడ్డి, ఇన్‌చార్జి ఎమ్మిగనూరు

### జనసేన, టీడీపీ అభ్యర్థులను గెలిపించుకుందాం



ఉమ్మడి జిల్లాలోని 14 నియోజకవర్గాల్లోని టీడీపీ, జనసేన అభ్యర్థులను గెలిపించుకుందాం. ఈ ప్రభుత్వంలో తాగడానికి నీరు అడిగితే మహిళను ట్రాక్టరుతో తొక్కించి చంపిన చరిత్ర వైసీపీ పాలనలో సాగుతోంది. రాష్ట్రంలో ఒక నియంత, రాక్షసుడితో పోరాడి గెలవాల్సిన అవసరం ఉంది.

-ఆకెపోగు రాంబాబు

### దళితులపై చిత్త శుద్ధి ఉంది



రాష్ట్రంలో దళితులకు జరుగుతున్న అన్యాయాన్ని ప్రతి ఒక్కరు గుర్తించి ఓటు అనే ఆయుధంతో జగన్‌కు బుద్ధి చెప్పాలి. ఒక ఎస్సీ అభ్యర్థి బొగ్గుల దస్తగిరిని ఎంపిక చేసిందంటే టీడీపీకి దళితులపై చిత్తశుద్ధిని అర్థం చేసుకోవచ్చు. ఎస్సీలంతా పార్టీ అధినేత చెప్పిన మాట ప్రకారం ప్రతి కార్యకర్త, నాయకుడు ముందుకు పోవాలి.

-మీనాక్షి నాయుడు, ఇన్‌చార్జి, ఆదోని

## పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలి




సమావేశంలో మాట్లాడుతున్న ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు గోకారి

**కర్నూలు(ఎడ్యుకేషన్), మార్చి 3:** రాష్ట్రంలో ఉన్న 11 లక్షల ఉద్యోగ ఉపాధ్యాయ కార్మిక పెన్షనర్లకు కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానం అమలు చేయాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ఎస్. గోకారి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక సలాంఖాన్ ఎస్టీయూ భవన్‌లో జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత నాలుగు సంవత్సరాల నుంచి పెండింగ్‌లో ఉన్న పీఆర్సీ, డీఏ, సరెండర్ లీవులను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా 30 శాతం మధ్యంతర భృతిని వెంటనే ప్రకటించాలని, లేనిపక్షంలో రాబోయే ఎన్నికల్లో ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని అన్నారు. రాష్ట్ర పూర్వ ప్రధాన కార్యదర్శి హెచ్. తిమ్మన్న మాట్లాడుతూ ప్రతిపక్షనేతగా అధికారంలోకి రాకముందు సీఎం జగన్ పాదయాత్రలో ఇచ్చిన హామీని అమలు చేయాలని సీపీఎస్‌ను రద్దు చేయకపోగా దాని స్థానంలో దుర్మార్గమైన జీపీఎస్‌ను తీసుకురావడం పట్ల, ఉద్యోగులు, ఉపాధ్యాయులు దానిని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయూ రాష్ట్ర సహాధ్యక్షుడు నాగరాజు, బి. వెంకటేశ్వర్లు, ఆర్థిక కమిటీ సభ్యుడు సుంకన్న, రాష్ట్ర కో అధ్యక్షుడు సమ్మార్తి, మహేష్, మహ్మద్ షఫి, వీరచంద్ర యాదవ్ తదితరులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### ఉపాధ్యాయ జాబితా వెల్లడి

**కర్నూలు(ఎడ్యుకేషన్), మార్చి 3:** జిల్లా విద్యాశాఖ జీవో.ఎంఎస్. నెం.79 ప్రకారం అర్హులైన ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ విభాగంలో ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్లు జూనియర్ లెక్చరర్ పోస్టులకు స్కూల్ అసిస్టెంట్ జాబితాను వెల్లడి చేసినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి సామ్యూయేల్ ఆదివారం తెలిపారు. ఇందులో ఏమైనా అభ్యంతరాలు ఉంటే సోమవారం ఉదయం 10 గంటలకు జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో అసిస్టెంట్ డైరెక్టర్ సమాచారం ఇవ్వాలని, లేకపోతే తమ దగ్గర ఉన్న జాబితాను ఫైనల్ జాబితాగా పరిగణిస్తామని అన్నారు.

### టీడీపీలో చేరనున్న చెరకుచర్ల రఘురామయ్య



చెరకుచర్ల రఘురామయ్య

**నందికొట్కూరు, మార్చి 3:** వైసీపీని వీడిన ఆ పార్టీ రాష్ట్ర అదనపు కార్యదర్శి చెరకుచర్ల రఘురామయ్య టీడీపీలో చేరేందుకు మార్గం సుగమమైనట్లు తెలుస్తోంది. త్వరలో నంద్యాలలో జరిగే ప్రజాగళం సభలో టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు సమక్షంలో చేరేందుకు టీడీపీ గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలుస్తోంది. నియోజకవర్గంలోని పాములపాడు, కొత్తపల్లి, పగిడ్యాల, నందికొట్కూరు, మిడ్తూరు మండలాల నుంచి 100 నుంచి 150 వాహనాల్లో దాదాపు 1200 నుంచి 1500 మంది తన అనుచరులతో కలిసి నంద్యాలలో జరిగే ప్రజాగళం సభలో పార్టీలో చేరుతున్నట్లు చెరకుచర్ల రఘురామయ్య తెలిపారు. నందికొట్కూరు అభ్యర్థి, నంద్యాల ఎంపీ అభ్యర్థులుగా పార్టీ ఎవరిని ప్రకటించినా అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేస్తామన్నారు. పార్టీలోని అందరూ నాయకులతో కలుపుకొని టీడీపీ విజయం కోసం పాటు పడతామని ఆయన తెలిపారు. నంద్యాలలో ప్రజాగళం సభ ఈనెల 6వ తేదీ జరగాల్సి ఉండగా చంద్రబాబు నాయుడు ఢిల్లీ వెళ్తున్న నేపథ్యంలో ఆ కార్యక్రమంలో వాయిదా పడినట్లు తెలుస్తోంది. 7వ తేదీ నుంచి నంద్యాల్లో ఎప్పుడు జరిగినా ఆ సభలో ఆయన టీడీపీలో చేరనున్నారు.

### షాదిఖానా ప్రారంభోత్సవానికి జనం కరువు

**ఆత్మకూరు, మార్చి 3:** రానున్న ఎన్నికల్లో ముస్లిం మైనార్టీల ఓట్లను గంపగుత్తగా పొందేందుకు ఆత్మకూరులో అధికార వైసీపీ చేసిన ప్రయత్నం బెడిసికొట్టినట్లు తెలుస్తోంది. ఆత్మకూరులో నూతనంగా నిర్మించిన షాదిఖానా ప్రారంభోత్సవానికి వేల సంఖ్యలో ముస్లిం మైనార్టీలు తరలివస్తారన్న అంచనాలు కాస్త తారుమారు కావడంతో వైసీపీ నేతలు తలలు పట్టుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. ఎన్నికలు సమీపిస్తుండటంతో ఎట్టకేలకు ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి హడావిడిగా షాదిఖానా నిర్మాణాన్ని పూర్తి చేసి ఆదివారం ప్రారంభోత్సవాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగానే స్థానిక కొత్తపేట మసీదు నుంచి షాదీఖానా వరకు వేల సంఖ్యలో ముస్లిం మైనార్టీలతో కలిసి ర్యాలీగా వెళ్లాలని భావించారు. ఇందుకు ఆర్భాటమైన ప్రచారం కూడా చేశారు. కానీ ర్యాలీకి జనం ఊహించినంతగా రాలేదు. వచ్చిన వారిలో వైసీపీకి చెందిన వ్యక్తులే అధికంగా ఉన్నారు. షాదిఖానా ప్రారంభోత్సవం అనంతరం ముస్లిం మైనార్టీల ఆత్మీయ కలయిక పేరుతో సభను నిర్వహించారు. ఇందులో కూడా పెదగా జనం కనిపించలేదు. ఇదిలావుంటే మున్సిపల్ చైర్మన్ డాక్టర్ మారూఫ్ ఆసియా, ఆమె తండ్రి, కోఆప్షన్ సభ్యులు ఎం.ఏ.రషీద్‌తో పాటు పలువురు కౌన్సిలర్లు షాదీఖానా ప్రారంభోత్సవానికి హాజరుకాకపోవడం గమనార్హం.

## మోసాల పాలన పోవాలి

- రాష్ట్రాన్ని భ్రస్టు పట్టించిన వైసీపీ
- కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి

**డోన్, మార్చి 3:** రాష్ట్ర ప్రజల భవిష్యత్తును అంధకారం చేసిన వైసీపీ మోసాల పాలన పోవాలని.. కేంద్ర మాజీ మంత్రి, డోన్ అసెంబ్లీ టీడీపీ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని సాయి ఫంక్షన్ హాలులో టీడీపీ బూత్ కమిటీలపై కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి, అయన తనయుడు కోట్ల రాఘవేంద్రరెడ్డి పార్టీ ముఖ్య నాయకులతో చర్చించారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శులు వై. నాగేశ్వరరావు యాదవ్, వలసల రామక్రిష్ణ, కోట్రికే ఫణిరాజ్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ టీఈ కేశన్నగౌడు, ఓబులాపురం శేషిరెడ్డి, లక్ష్మీనారాయణ యాదవ్ తదితరులతో చర్చించారు. అనంతరం కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ సీఎం జగన్ తన అసమర్థ పాలనతో రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించారని మండిపడ్డారు. కల్తీ మద్యం, గంజాయి, మాఫియాలకు అడ్డాగా రాష్ట్రాన్ని మార్చి యువత భవిష్యత్తును వైసీపీ నాశనం చేసిందని అన్నారు. వైసీపీ పాలనపోయి అభివృద్ధిని అందించే చంద్రబాబు పాలన రావాలని అన్నారు. గత టీడీపీ హయాంలో ఐటీ కంపెనీలు, కియా వంటి పరిశ్రమలు తీసుకువచ్చి నిరుద్యోగ యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించిన ఘనత చంద్రబాబుకే దక్కిందన్నారు. సీఎం జగన్ రాష్ట్రాన్ని దోచుకోవడం తప్ప ప్రజలకు చేసిందేమీ లేదని ఎద్దేవా చేశారు. డోన్ నియోజకవర్గంలో ఉన్న పరిశ్రమలు మూతపడి నిరుద్యోగ యువత కార్మికులు రోడ్డున పడాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. వైసీపీ పాలనలో రైతులకు అప్పులు, నష్టాలే మిగిలాయన్నారు. సమావేశంలో మండల పార్టీ అధ్యక్షుడు శ్రీనివాసులు యాదవ్, ప్యాపిలి మండల అధ్యక్షుడు గండి కోటరామసుబ్బయ్య, సుధీష్, చంద్రపల్లి ఆచారి, గోవిందరెడ్డి, గోసానిపల్లి మల్లయ్య, మాజీ సర్పంచ్ భోగేశ్వరరెడ్డి, వలసల బాలుడు, రవి, అజీజ్ తదితరులు పాల్గొన్నారు.



కోట్ల సూర్యప్రకాష్ రెడ్డికి మద్దతు తెలుపుతున్న ఇందిరా నగర్ యువకులు

## టీడీపీ హయాంలోనే అభివృద్ధి: గౌరు చరిత

**పాణ్యం, మార్చి 3:** టీడీపీ హయాంలోనే పాణ్యం అభివృద్ధి జరిగిందని పాణ్యం నియోజక వర్గ టీడీపీ ఇన్‌చార్జి గౌరు చరిత అన్నారు. స్థానిక సిమెంటు వ్యాపారి మూల రాంమోహన్‌రెడ్డితో పాటు మరి కొంత మంది ఆదివారం గౌరు చరిత సమక్షంలో టీడీపీలో చేరారు. గౌరు చరిత, టీడీపి జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖ ర్‌లు వారిని టీడీపి కండువా వేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాణ్యం మండలం టీడీపీ హయాంలోనే పలు అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయన్నారు. వైసీపీ నాయకులు దోచుకోవడం, దాచుకోవడమే ధ్యేయంగా పెట్టుకున్నారని విమర్శించారు. ఎమ్మెల్యే కాటసానిని పదవి నుంచి దించడాకి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ రంగరమేష్, నాయకులు జయరామిరెడ్డి, రామమోహన్‌నాయుడు, మాజీ సర్పంచ్ గంగా నారాయణ, ప్రభాకర్ పాల్గొన్నారు.



టీడీపీ కండువా వేసి ఆహ్వానిస్తున్న గౌరు చరిత

### కోలుకోలేక యువకుడి మృతి

**బేతంచెర్ల, మార్చి 3:** మండలంలోని శంకరాపురం గ్రామానికి చెందిన నల్లబోతుల పుల్లయ్య కుమారుడు వేణుగోపాల్ (20) అనే యువకుడు కర్నూలు ప్రభుత్వంలో చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందాడని ఏఎస్ఐ లింగమయ్య ఆదివారం తెలిపారు. గ్రామానికి చెందిన వేణుగోపాల్ డోన్ పట్టణంలోని జూనియర్ కాలేజీలో చదువుతున్నాడు. కాగా కళాశాలకు సరిగ్గా పోవడం లేదని తల్లిదండ్రులు మందలించడంతో మనస్తాపానికి గురైన వేణుగోపాల్ గత నెల 29న గ్రామ సమీపంలోని బలిజ సాంబయ్య పొలం వద్ద పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కర్నూలు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక ఆదివారం మృతి చెందాడని ఏఎస్ఐ లింగమయ్య తెలిపారు.

## ఆలూరులో వైసీపీ సమన్వయకర్తల సమావేశం

- గైర్హాజరైన ఆలూరు జడ్పీటీసీ, వైస్ ఎంపీపీ
- చివరి వరకు ప్రోగ్రాంపై రాని స్పష్టత



ఆలూరులో పర్యటిస్తున్న వైసీపీ సమన్వయకర్త విరుపాక్షి

**ఆలూరు, మార్చి 3:** ఆలూరు వైసీపీలో మంత్రి గుమ్మనూరు జయరాం మార్కు ఆధిపత్యం సాగుతోంది. ఆదివారం ఆలూరు పట్టణంలో ఆలూరు వైసీపీ సమన్వయకర్త విరుపాక్షి పర్యటనకు ముందు రోజే ఏర్పాట్లు చేసినా, ఆదివారం ఉదయం మంత్రి జయరాం కొందరి ముఖ్యనేతలకు ఫోన్లు చేసి కార్యక్రమానికి వెళ్లవద్దని సూచించినట్లు తెలిసింది. దీంతో ప్రోగ్రాం వాయిదా వేసినట్లు కార్యకర్తలకు కొందరు ఫోన్లు చేయగా, విరుపాక్షి మాత్రం తాను కార్యక్రమానికి వస్తానని, ఎందుకు వాయిదా వేస్తారని అనడంతో ఆలూరు మాజీ ఎంపీటీసీ కిషోర్ ఆధ్వర్యంలో ఎస్సీ కాలనీలో పర్యటించారు.

**కార్యక్రమానికి జడ్పీటీసీ, వైస్ ఎంపీపీ గైహాజరు**

వైసీపీ సమన్వయకర్త విరుపాక్షి నిర్వహించిన కార్యక్రమానికి చివరి క్షణంలో జడ్పీటీసీ సభ్యులు ఏరూరు శేఖర్, వైస్ ఎంపీపీ నాగవేణి, భర్త శ్రీధర్ వర్గం గైర్హాజరు అవ్వడం పార్టీ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. మంత్రి ఫోన్ చేయడం వల్లే కార్యక్రమానికి హాజరు కాలేదని కొందరు చర్చించుకుంటుండగా, అలా ఏమీ లేదని, తన వ్యక్తిగత పనుల నిమిత్తం వేరే ప్రాంతానికి వెళ్లాల్సి వచ్చిందే తప్ప, ఇతర కారణాలు లేవని, తాను వైసీపీలోనే కొనసాగుతున్నట్లు తెలిపారు. జెడ్పీటీసీ వెంటే తాము నడుస్తామని వైస్ ఎంపీపీ భర్త శ్రీధర్ తెలిపారు. ఏది ఏమైనప్పటికీ వైసీపీలో మాత్రం వర్గవిభేధాలు మాత్రం వీడటం లేదు.

## మెడికల్ కాలేజీలో గ్రాడ్యుయేషన్ డే



ప్రమాణం చేస్తున్న వైద్య విద్యార్థులు



జ్యోతిప్రజ్వలన చేస్తున్న దృశ్యం

**కర్నూలు(హాస్పిటల్), మార్చి 3:** కర్నూలు మెడికల్ కాలేజీలో గ్రాడ్యుయేషన్ డే ఘనంగా జరిగింది. ఆదివారం రాత్రి కళాశాల మైదానంలో 2018 బ్యాచ్ వైద్యుల గ్రాడ్యుయేషన్ కార్యక్రమానికి ప్రిన్సిపాల్ డా.చిట్టి నరసమ్మ అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథులుగా రిటైర్డ్ ప్రిన్సిపాల్స్ డా.పి.సుధాకర్, డా.పీఎస్ జిక్కి, ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.వెంకటరంగారెడ్డి, డిప్యూటీ సూపరింటెండెంట్ డా.ప్రభాకర్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ డా.సాయిసుధీర్, డా.హరిచ రణ్ పాల్గొన్నారు. ఎంబీబీఎస్ పూర్తి చేసినవారికి పట్టాలు పంపిణీ చేశారు. వైస్ ప్రిన్సిపల్ డా.హరిచరణ్ డా.నివేదిత దంపతుల కూతురు పి.నమ్రత ఏకంగా ఏడు విభాగాల్లో గోల్డ్ మెడల్‌ను కైవసం చేసుకుంది. ఎన్.నాగహారిక (బయోకెమిస్ట్రి), సాయితరుణ్, వెంకట వైష్ణవి, (ఫెథాలజి) వెంకట వైష్ణవి (ఈఎన్‌టీ) నాగహరిక (అప్తామాలజి), సాయి తరుణ్ (ఎస్‌పీఎం), వంశీకృష్ణ, కీర్తన (గైనిక్)లలో గోల్డ్ మెడల్స్ అందుకున్నారు.

## విద్యాభివృద్ధికి ఆర్‌డీటీ తోడు



భూమి పూజ చేస్తున్న గ్రామస్థులు

**మద్దికెర, మార్చి 3:** మండలంలోని హంపా గ్రామ ఎస్సీ కాలనీలో పాఠశాల నిర్మాణానికి ఆర్‌డీటీ సంస్థ చేయూతనిచ్చింది. ఎస్సీ కాలనీలో బొమ్మనపల్లి గ్రామానికి చెందిన అశోక్‌కుమార్ పాఠశాల నిర్మాణానికి స్థలం ఇవ్వడంతో ఆదివారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా కాలనీవాసులు మాట్లాడుతూ తమ కాలనీలో పిల్లలు చదివేందుకు సరైన పాఠశాలలు లేవని, ఆర్డీటీ సంస్థ దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. స్థలాన్ని చూపిస్తే ఆర్డీటీ సంస్థ నిర్మాణం చేపడుతుందని తెలపడంతో కాలనీవాసులంతా కలిసి బొమ్మనిపల్లి అశోక్‌ను స్థలం ఇవ్వమని కోరగా ఆయన స్థలం ఇచ్చారని తెలిపారు. ఆర్‌డీటీ సంస్థకు రుణపడి ఉంటామని కాలనీవాసులు పేర్కొన్నారు.

## మహా శివరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి

**తుగ్గలి, మార్చి 3:** మహాశివరాత్రిని పురస్కరించుకొని ఫక్కీరప్ప స్వామి, తిమ్మగురుడుల దేవాలయాలను అందరంగా ముస్తాబు చేశారు. ఆదివారం బోడిబండలో ఫక్కీరప్పస్వామి, తిమ్మగురుడులో శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా జాగర చేసేందుకు దేవాలయాలకు వచ్చే భక్తుల కోసం అన్ని ఏర్పాట్లు సిద్ధం చేసినట్లు ఆలయ ధర్మకర్త, టీడీపీ సీనియర్ నాయకులు అప్పా వేణుగోపాల్ తెలిపారు. 8వ తేదీన స్వామివార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు. 9న కల్యాణం, రథోత్సవం నిర్వహిస్తామని, ఈ ఉత్సవాలకు కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాలతో పాటు ఇతర జిల్లాల ప్రజలు పెద్దసంఖ్యలో హాజరవుతారని ఆయన తెలిపారు. హైదరాబాదు శ్రీరాములు చేతుల మీదుగా అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

## రేపటి ధర్నాను జయప్రదం చేయండి

**కోసిగి, మార్చి 3:** ఉపాధి కూలీల సమస్యలపై ఈ నెల 5న ఆదోని సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట జరిగే ధర్నాను కూలీలందరూ జయప్రదం చేయాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కె.లింగన్న అన్నారు. ఆదివారం కోసిగిలోని సీఐటీయూ మండల కార్యదర్శి రాముడు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని ఈ ఏడాది తీవ్ర కరువు పరిస్థితుల ప్రభావంతో గత సంవత్సరం నవంబరు నుంచి ఊళ్లకు ఊళ్లు ఇళ్లకు తాళాలు వేసి వేలాది మంది వ్యవసాయ కూలీలు వలస బాట పడుతున్నా అధికారులు చోద్యం చ చూస్తున్నారని విమర్శించారు. సమస్య పరిష్కారం కోరుతూ ఈ నెల 5న ఆదోని సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట ఉదయం 10 గంటలకు ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కేవీపీఎస్ మండల కార్యదర్శి హనుమంతు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు చిన్నారెడ్డి, చిన్నన్న, రాము తదితరులు పాల్గొన్నారు.

## ఎంఈవో దంపతులకు సన్మానం

**పత్తికొండ టౌన్, మార్చి 3:** పట్టణంలో మండల విద్యాధికారి మస్తాన్‌వలి దంపతులను ఆదివారం ఘనంగా సన్మానించారు. స్థానిక యశోదా గార్డెన్ హైస్కూల్ ఆవరణలో జరిగిన ఎంఈవో మస్తాన్‌వలి పదవీ విరమణ వేడుకల సందర్భంగా పలు రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు. మస్తాన్‌వలి దంపతులను శాలువ, పూలమాలతో ఘనంగా సత్కరించి ఆయన విద్యాశాఖలో పని చేసిన సేవలను కొనియాడారు.

## నిరుద్యోగులను వంచించారు

● సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామచంద్రయ్య

**పత్తికొండ టౌన్, మార్చి 3:** గత ఎన్నికల్లో ఎన్నో హామీలను గుప్పించి మోసం చేసిన కేంద్ర, రాష్ట్ర పాలకులకు వచ్చే ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రామచంద్రయ్య పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక సీఆర్ భవన్‌లో ఏఐవైఎఫ్ జనరల్‌బాడీ సమావేశం నియోజకవర్గ అధ్యక్షుడు పెద్దయ్య అధ్యక్షతన జరిగింది. రామచంద్రయ్య మాట్లాడుతూ ఏటా లక్షలాది ఉద్యోగాలు ఇస్తామని మాయమాటలు చెప్పి కొత్త ఉద్యోగాలు ఇవ్వకపోగా.. ఉన్న ఉద్యోగాలను ఊడకొట్టే పనిలో పాలకులు ఉన్నారన్నారు. రాష్ట్రంలో జాబ్ క్యాలెండర్, మెగా డీఎస్సీ పేరుతో యువతను నిలువునా నట్టేటముంచడం జగన్ ప్రభుత్వానికే చెల్లుబాటైందన్నారు. కేంద్రంలో మోదీ, రాష్ట్రంలో జగన్ రెడ్డి ప్రజా వ్యతిరేక పాలనను అంతమొందించేందుకు రాబోయే ఎన్నికల్లో ఇండియా కూటమిని బలపరచాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ ఉమ్మడి మాజీ జిల్లా కార్యదర్శి భీమలింగప్ప, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కారుమంచి, సీపీఐ మండల కార్యదిర్శి రాజాసాహేబ్, ఏఐవైఎఫ్ నియోజకవర్గ కార్యదిర్శి హనుమేష్ పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న గ్రామస్తులు

## కరివేములలో రక్తదాన శిబిరం

**దేవనకొండ ,మార్చి 3 :** వన్నూరు స్వామి ఉరుసు సందర్భంగా కరివేములలో రక్తదాన శిబిరం నిర్వహించారు. డానియోల్ రాజ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన 53 మంది రక్తదానం చేశారు. గ్రామస్తులు జనర్దన్ రెడ్డి మాట్లాడుతూ రక్తదానంతో ఆపద సమయంలో మరొకరికి ప్రాణదాతలుగా మారుతామని, గ్రామంలో యువకుల సహకారంతో శిబిరం విజయవంతమైందని పేర్కొన్నారు. కార్యక్రమంలో వన్నూరప్ప ,వీరేష్ ,ప్రతాప్ ,కృష్ణ ,రవి తదితరులు పాల్గొన్నారు.

## మట్టిలో మాణిక్యం

● కంది పంట పరిశోధనలో జమేదార్ హర్షవర్ధన్ రాయుడుకి డాక్టరేట్



జమేదార్ హర్షవర్ధన్ రాయుడు

**మద్దికెర, మార్చి 3 :** మద్దికెర గ్రామంలో నివసించే జమేదార్ నీలకంఠరాయుడు, జమేదార్ ధనలక్ష్మి రెండో కుమారుడైన జమేదార్ హర్షవర్ధన్ రాయుడు అగ్రికల్చర్‌లో కంది పంట తక్కువ పెట్టుబడి, తొందరలో దిగుబడి అనే అంశంపై పట్టుదలతో చదివి డాక్టరేట్ పొందాడు. 1వ తరగతి నుంచి 10 వరకు గుంటూరు లయోలా పబ్లిక్ స్కూల్‌లో చదివి.. ఇంటర్‌లో శ్రీచైతన్య విద్యాలయంలో పూర్తి చేశాడు. బాపట్లలోని ఆచార్య ఇంజనీరింగ్ కళాశాలలో అగ్రికల్చర్ బీఎస్సీ నాలుగేళ్లు చదివి విద్యాభ్యాసం పూర్తి చేశాడు. ఆ తర్వాత మేఘాలయలో భారతీయ వ్యవసాయ పరిశోధన మండలిలోని పీజీలో చేరి కంది పంటలో జన్యుపరిశోధనలో శాస్త్రవేత్తగా రాణించి పీజీ పూర్తి చేశాడు. హైదరాబాదులోని రాఘవేంద్రనగర్‌లో గల ఇక్రిషాట్‌లోగల నాలుగేళ్లు కంది పంటపైన మూడేళ్ల పాటు పరిశోధన చేశాడు. దీనికి ఆచార్య ఎన్జీరంగా యూనివర్సిటీ గూంటూరు డాక్టరేట్‌ను అందజేశారు. టీడీపీ నాయకులు నగిరి క్రిష్ణన్న, రఘు యాదవ్ అభినందించారు.

## ఎల్లమ్మ జాతరలో సందడే సందడి..

**కోసిగి, మార్చి 3:** కోసిగిలోని రేణుకా ఎల్లమ్మ జాతరలో ఆదివారం చిన్న పిల్లలు, యువత సందడితో కోలాహలంగా కనిపించింది. యువకుల కేరింతలు కొడుతూ రంగుల రాట్నం తిరుగుతూ, నృత్యాలు వేస్తూ ఉల్లాసంగా గడిపారు.

# ఇసుక భోజనం

● సాతనూరు సమీపంలో అధికార పార్టీ నేతల బరితెగింపు
● పది రోజులుగా తుంగభద్రలో అక్రమంగా ఇసుక తరలింపు
● పట్టించుకోని అధికారులు, పోలీసులు



తుంగభద్ర నుంచి ఇసుకను అక్రమంగా ట్రాక్టర్లలో తరలిస్తున్న దృశ్యం



సాతనూరు సమీపంలో తుంగభద్రనదిలో ఏర్పడ్డ గుంతలు

**కోసిగి, మార్చి 3:** అధికారం చేతిలో ఉంది.. నాయకుల అండదండలు పుష్కలంగా ఉన్నాయి.. అధికారులు, పోలీసులు కన్నెత్తి చూడరు.. ఇంకేముంది అధికార పార్టీ నాయకులు ఆడిందే ఆట.. పాడిందే పాట.. కాసుల కక్కుర్తితో యథేచ్ఛగా ఇసుకను మింగేస్తున్నారు.

కోసిగి మండల పరిధిలోని సాతనూరు గ్రామ సమీపంలోని తుంగభద్ర నదిలో అధికార పార్టీ వైసీపీకి చెందిన నాయకులు తమ సొంత ట్రాక్టర్లలో రూ.లక్షలు విలువ చేసే ప్రకృతి సంపదను యథేచ్ఛగా తోడేస్తున్నారు. ఇసుక అక్రమంగా రవాణా చేస్తూ భూగర్భజలాలకు ముంపు తెస్తున్నారు. పగలు, రాత్రి అనే తేడా లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తూ లక్షల్లో జేబులు నింపుకుంటున్నారు. పోలీసులు, రెవెన్యూ, సెబ్, మైనింగ్ అధికారులు నామమాత్రపు చర్యలతోనే సరిపెడుతుండడంతో అధికార వైసీపీ నాయకులు మరింత రెచ్చిపోతున్నారని సాతనూరు గ్రామస్థులు మండిపడుతున్నారు. జంపాపురం గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు రవాణా కాంట్రాక్టరు అధికార పనులకు రోడ్లు, డ్రైనేజీ వంటి పనులకు తుంగభద్ర నది నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్నా అధికారులు కన్నెత్తి చూడకపోవడం గమనార్హం. అలాగే సాతనూరు, ఐరెంగల్ గ్రామాలకు చెందిన అధికార పార్టీ వైసీపీ నాయకులు సొంత ట్రాక్టర్లలో ఇసుకను పగలు, రాత్రి అనేతేడా లేకుండా తోడేస్తున్నారు. వారం రోజులుగా రాత్రి 7 గంటల నుంచి తెల్లవారుజాము వరకు అక్రమంగా ట్రాక్టర్లలో ఇసుకను తరలిస్తున్నారు.. 'అధికారులకు సమాచారం ఇచ్చాం అయినా చర్యలు లేవు. తుంగభద్రను కాపాడేవారే లేరా' అంటూ గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. నదితీర గ్రామాల్లోని అధికార పార్టీ నాయకులు రాత్రయితే చాలు ట్రాక్టర్ల ద్వారా తుంగభద్ర నదిలో వాలిపోతున్నారు. ఒక ట్రాక్టరు ఇసుక రూ.3వేల నుంచి రూ.4వేల వరకు అక్రమంగా అమ్మకాలు సాగిస్తున్నారు. కనీసం రోజుకు వంద ట్రిప్పుల ఇసుకను తుంగభద్ర నది నుంచి తోడేస్తున్నా అధికారుల కిమ్మనకపోవడం అనుమానాలకు తావిస్తోంది. 'అరకొరగా అధికారులు తనిఖీలు చేస్తారు.. ట్రాక్టర్లు దొరికినప్పటికీ పైస్థాయి నాయకుల నుంచి ఫోన్లు వచ్చిన వెంటనే అక్కడే వదిలేసి వెళ్తున్నారు' అంటూ గ్రామస్థులు వాపోయారు. తుంభద్రనదిలో నుంచి అక్రమంగా ఇసుకను తరలించడంతో భూగర్భజలాలకు ప్రమాదం వస్తోందని నది పరివాహక ప్రాంతాల రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 'తుంగభద్ర నదిని నమ్ముకొని సాగుచేస్తున్నాం.. ఈ ఇసుకాసురుల వల్ల ఇప్పుడు భూగర్భజలాలు అడుగంటిపోయే ప్రమాదం ఏర్పడింది' అంటూ రైతులు లబోదిబోమంటున్నారు.

# పల్స్ పోలియో విజయవంతం

ఆదివారం జిల్లా వ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన పల్స్ పోలియో కేంద్రాల్లో ఐదేళ్లలోపు చిన్నారులకు విజయవంతంగా పోలియో చుక్కలు వేశారు. బస్టాండ్, రైల్వేస్టేషన్‌లతో పాటు అర్బన్ హెల్త్ సెంటర్లు, రద్దీగా ఉన్న అనేక ప్రాంతాలలో కేంద్రాలను ఏర్పాటు చేసి చిన్నారులకు పోలియో చుక్కలను వేసేలా అధికారులు చర్యలు తీసుకున్నారు.



ఆదోని బస్టాండులో పోలియో చుక్కలు వేస్తున్న మున్సిపల్ కమిషనర్

**ఆదోని టౌన్, మార్చి 3:** ఆదోని పట్టణంలోని ఏర్పాటు చేసిన 106 పోలియో కేంద్రాలలో చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. వెంకన్నబావి ఎదురుగా ఏర్పాటు చేసిన పోలియో కేంద్రాన్ని ఎమ్మెల్సీ మధుసుధన్ రావు, మున్సిపల్ చైర్‌పర్సన్ బోయ శాంత ప్రారంభి, పోలియో చుక్కలు వేశారు. ఎమ్మిగనూరు టర్నింగ్‌లోని పోలీస్ కంట్రోల్ రూమ్ ప్రాంతంలోని పోలియో కేంద్రంతో పాటు, కొత్తబస్టాండ్ ప్రాంగణంలో కమిషనర్ రామచంద్ర రెడ్డి చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. డీఎంఅండ్‌హెచ్‌వో సత్యవతి వైద్య సిబ్బందితో అన్ని పోలియో కేంద్రాలను పర్యవేక్షించి, ప్రజల్లో అవగాహన కల్పించారు.

**ఆదోని రూరల్ :** ఉదయం 7 నుంచి సాయంత్రం 5గంటల వరకు మండల పరిధిలోని ప్రభుత్వ కార్యాలయాల్లో, ప్రధాన కూడలిలో పోలియో చుక్కలు వేశారు. పెద్దహరివాణం పీహెచ్‌సీ పరిధిలో 6,279మంది ఉండగా, మొదటి రోజు 6,066మందికి, పెద్దతుంబళం పీహెచ్‌సీ పరిధిలో 5,330మందికిగాను 5,023మంది పిల్లలకు పోలియో చుక్కలు వేసినట్లు డిప్యూటీ డీఎం అండ్‌హెచ్‌ఓ సత్యవతి తెలిపారు.

**మద్దికెర :** మండలంలోని మద్దికెర, పెరవలి, ఎం.అగ్రహారం తదితర గ్రామాల్లో ఫల్స్ పోలియో విజయవంతమైంది. మండలంలో 95 శాతం పిల్లలకు పోలియో చుక్కలు వేశామని ప్రభుత్వ వైద్యాధికారి శ్రీలక్ష్మి, రాగిణి తెలిపారు. సీహెచ్‌వో నిరంజన్‌బాబు, హెల్త్ ఎడ్యుకేటర్ అక్బర్‌బాషా తదితరులు ఉన్నారు.

**తుగ్గలి :** తుగ్గలి, పగిడిరాయి వైద్యశాలల పరిధిలోని అన్ని గ్రామాల్లో వైద్యులు ప్రవీణ్‌కుమార్, ఫాతిమా, హరిత చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. కార్యక్రమంలో సర్పంచ్ రవి, ఎంపీడీవో రాజు, సర్పంచు పుష్పావతి తదితరులు ఉన్నారు.

**కోసిగి :** మండలంలో 0 నుంచి 5 ఏళ్లలోపు చిన్నారులు 10,009 మంది ఉండగా.. 9,700 మందికి పోలియో చుక్కలు వేశామని మెడికల్ ఆఫీసర్ మనోజ్ కుమార్ తెలిపారు. మోడల్ స్కూల్‌కు చెందిన స్కౌట్స్ అండ్ గైడ్స్ రాజేశ్వరి టీమ్ సభ్యులు పోలియోపై అవగాహన కల్పించారు. వైద్యులు అభిరుద్, రజిత పాల్గొన్నారు.

**పెద్దకడుబూరు:** దొడ్డిమేకలలో పల్స్ పోలియో చుక్కల కార్యక్రమాన్ని సర్పంచు చంద్రశేఖర్ ప్రారంభించారు. మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో పల్స్ పోలియో కార్యక్రమంలో వైద్య సిబ్బంది యల్లమ్మ, చంద్రకళ పాల్గొన్నారు

**కౌతాళం :** స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, బదినేహాల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని చిన్నారులకు పోలియో చుక్కలు వేసినట్లు డాక్టర్ పావని తెలిపారు. మండ లంలోని పోలియో చుక్కల కేంద్రాలను ఎంపీడీఓ రఘునాథ్‌గుప, బాల మురళిక్రిష్ణ, ముత్యాల కిరణ్ పరిశీలించారు.

**దేవనకొండ :** మండల వ్యాప్తంగా 92 శాతం మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేసినట్లు అడిషనల్ డీఎంహెచ్‌వో భాస్కర్, డీడీవో విజయభాస్కర్ వైద్యాధికారి కళ్యాణ్ తెలిపారు. ఐదేళ్ల లోపు చిన్నారులు 7648 మంది ఉండగా 7038 మందికి చుక్కలు వేశామని పేర్కొన్నారు.

**గోనెగండ్ల:** మండల పరధిలోని పలు గ్రామాలలో 94 శాతం మంది చిన్నారులకు 47 కేంద్రాల్లో వైద్యసిబ్బంది పోలియో చుక్కలు వేసినట్లు వైద్యురాలు రంగరవళి తెలిపారు. మండల వ్యాప్తంగా 8870 మందికి గాను 8044 మంది చిన్నారులకు చుక్కలు వేసినట్లు పేర్కొన్నారు.

**ఎమ్మిగనూరు:** పట్టణంలోని 21వ వార్డులో టీడీపీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ దయాసాగర్ చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. శిల్పా ఎస్టేట్‌లోని అర్బన్ హెల్త్ సెంటర్‌లో వైసీపీ సమన్వయకర్త బుట్టా రేణుక, అలాగే ప్రభుత్వ వైద్యశాలలో టీడీపీ నాయకులు సోంనాథ్ చిన్నారులకు చుక్కలు వేశారు. పట్టణంలో 50కేంద్రాలను ఏర్పాటు చేసి 10,466మంది చిన్నారులకుపల్స్ పోలియో చుక్కలు వేసి 96శాతం పూర్తి చేసినట్లు వైద్యాధికారులు తెలిపారు.

# పేదల గొంతు నొక్కుతున్న సీఎం

● అభివృద్ధి, సంక్షేమం బాబుతోనే సాధ్యం
● లక్ష్మీపేటలో మాజీ ఎమ్మెల్యే బీవీ ప్రచారం



లక్ష్మీపేటలో ప్రచారం నిర్వహిస్తున్న జయనాగేశ్వరరెడ్డి

**ఎమ్మిగనూరు, మార్చి 3:** బటన్ నొక్కుడు పేరుతో రాష్ట్రంలోని పేదప్రజల గొంతును సీఎం జగన్ నొక్కుతున్నారని మాజీ ఎమ్మెల్యే జయనాగేశ్వరరెడ్డి అన్నారు. బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా ఆదివారం పట్టణంలోని 33వ వార్డు లక్ష్మీపేటలో పర్యటించారు. ఈ సందర్భంగా ఈ ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అన్ని రకాల నిత్యవసర సరుకుల ధరలు పెంచటంతో పాటు ఎనిమిది సార్లు విద్యుత్ చార్జీలు పెంచి ప్రజలపై ఎనలేని భారాన్ని మోపిన ఘనత జగన్ సర్కార్‌దేనని విమర్శించారు. ఎమ్మిగనూరులో ఇళ్లు లేని పేదలకు టీడీపీ హయాంలో టిడ్కో ఇళ్లు నిర్మిస్తే ఈ వైసీపీ ప్రభుత్వం కక్షగట్టి ఇళ్లను లబ్ధిదారులకు ఇవ్వకుండా అడ్డుకుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే పేదలకు గృహాలను మంజూరు చేస్తామని పేర్కొన్నారు. రాష్ట్రాభివృద్ధి, సంక్షేమం చంద్రబాబుతోనే సాధ్యమఇ స్పష్టం చేశారు. టీడీపీ మాజీ కౌన్సిలర్ రామకృష్ణనాయుడు, కౌన్సిలర్లు దయాసాగర్, రామదాసు గౌడ్, మాజీ మున్సిపల్ వైస్‌చైర్మన్ కొండయ్య చౌదరి, మాజీ కౌన్సిలర్లు రంగస్వామి గౌడ్, జయన్న, రవి, మల్లి, నాయకులు కటారి రాజేంద్ర, మిన్నప్ప, రామకృష్ణ, అంజనేయులు, అబ్దుల్‌లు పాల్గొన్నారు.

# చేనేతల సంక్షేమం కోసం కృషి చేస్తా

● మాచాని సోంనాథ్



మాట్లాడుతున్న మాచాని సోంనాథ్

**ఎమ్మిగనూరు, మార్చి 3:** ఎమ్మిగనూరు చేనేతల సంక్షేమం కోసం తన వంతు కృషి చేస్తానని టీడీపీ నాయకులు మాచాని సోంనాథ్ అన్నారు. ఆదివారం పట్టణంలోని హెచ్‌బీఎస్ కాలనీ ఎంజీ బంగ్లాలో చేనేతల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ముందుగా ర్యాలీగా వెళ్లి మాచాని సోమప్ప సర్కిల్‌లో మాచాని సోమప్ప విగ్రహనికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడుతూ తమ ముత్తాత పద్మశ్రీ మాచాని సోమప్ప ఎమ్మిగనూరు పట్టణాభివృద్ధికి, పట్టణ ప్రజల సంక్షేమం కోసం ఎన్నో సేవలు అందించారని గుర్తుచేశారు. ఆయన బాటలో తాత మాచాని శివన్న, మాచాని రఘునాథ్ సేవలు అందించారన్నారు. తాను కూడా ఒక విజన్‌తో వచ్చానన్నారు. నేతన్నలు ఎంతో ఇబ్బంది పడుతున్నారని, ప్రభుత్వం పట్టించుకోవటం లేదని అన్నారు. టెక్స్‌టైల్ పార్కు కోసం కృషి చేస్తానన్నారు. ఇక్కడే ఉండి చేనేతల కోసం పనిచేస్తానని పేర్కొన్నారు. సాయంత్రం పట్టణంలోని ఎస్సీ వార్డుల్లో బాబు ష్యూరిటి భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. సమావేశంలో నాయకులు కేఎస్సీ శివన్న, మాచాని ఆదిత్య, మాచాని శివకుమార్, అడ్వకేట్ పరమేశప్ప, బీఎన్ నాగిరెడ్డి, శివదాసు, మాకం నారాయణ, సరోజమ్మ, నరసమ్మ, బండా బాస్కర్, నజీర్, వెంకటేష్, పంపయ్య, సుధాకర్ శెట్టి పాల్గొన్నారు.

# టీడీపీతోనే దళితులకు న్యాయం

● కర్నూలు సింహగర్జనకు తరలిన ఎస్సీ సెల్ నేతలు
● ఐదేళ్లలో దళితులను కోలుకోలేని దెబ్బ తీశారు
● ఎన్నికల్లో జగన్‌రెడ్డికి గుణపాఠం తప్పదంటూ హెచ్చరిక

**మద్దికెర, మార్చి 3:** రాష్ట్రంలోని దళితులందరికీ న్యాయం జరగాలంటే ఒక్క టీడీపీతోనే సాధ్యమని మండల టీడీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు ఎం.అగ్రహారం ఆనంద్ కుమార్ అన్నారు. ఆదివారం మండలంలోని అగ్రహారం, ఎడవలి గ్రామాల నుంచి తాలుకా టీడీపీ ఇన్‌చార్జి కేఈ శ్యాంబాబు పిలుపు మేరకు కర్నూలులో జరుగుతున్న దళిత సింహగర్జనకు వెళ్లారు. ఈ సందర్భంగా జిల్లా టీడీపీ అధ్యక్షుడు బీటీ నాయుడు, రాష్ట్ర ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు తిరుపాలును కలిసి అభినందించారు. టీడీపీ అధినేత చంద్రబాబు దళితుల కోసం ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేశారన్నారు. ప్రస్తుతం వైసీపీ ప్రభుత్వంలో దళితులకు తీవ్రమైన అన్యాయం జరుగుతోందని, ఎస్సీ, ఎస్టీ రుణాలు తీసివేయడం వల్ల నిరుద్యోగ యువత రోడ్డున పడ్డారని గుర్తుచేశారు. కార్యక్రమంలో ఎస్సీ సెల్ టీడీపీ నాయకులు కాశీ నాథ్, అంజి, ఎడవలి రాము, అగ్రహారం రాంబాబు, ఈశ్వరయ్య, తదితరులు ఉన్నారు.

**గోనెగండ్ల :** వచ్చే అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలలో రాష్ట్రంలోని దళితులు టీడీపీ వైపే ఉన్నారని గోనెగండ్ల మేజర్ సర్పంచు హైమావతి, అడ్వకేట్ చంద్రశేఖర్, వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం కర్నూలులో జిల్లా దళిత నాయకులు సమావేశం టీడీపీ అధ్వర్యంలో జరిగింది. గోనెగండ్ల నుంచి 3 వాహనాలలో కర్నూలుకు తరిలారు. ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఎంఎస్ రాజు, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి, జిల్లా పార్టీ అధ్యక్షుడు బీటీ నాయుడు హాజరయ్యారు. వీరిని సమావేశ ప్రాంగణంలో గోనెగండ్ల సర్పంచు హైమావతి, అడ్వకేట్ చంద్రశేఖర్, వెంకటేశ్వర్లు శాలువలు, పుష్పగుచ్చాలతో సన్మానించారు.



బీటీ నాయుడుని కలిసిన మండల ఎస్సీ సెల్ నాయకులు



మంత్రాలయం నుంచి దళిత సింహగర్జనకు తరలుతున్న నాయకులు

**మంత్రాలయం :** కర్నూలులో జరిగిన దళిత సింహగర్జన సభకు మంత్రాలయం నియోకవర్గ టీడీపీ ఇన్‌చార్జి తిక్కారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి పాలకుర్తి శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో ఆరు ప్రత్యేక వాహనాల్లో టీడీపీ ఎస్సీ సెల్‌నేతలు తరలి వెళ్లారు. ఈ సందరంగా ఎస్సీ సెల్ జిల్లా నాయకులు యేబు, ఐటీడీపీ నియోకవర్గ అధ్యక్షుడు సోల్మాన్‌రాజు, ఎంపీటీసీ భాస్కర్, ఐటీడీపీ మండల అధ్యక్షుడు చిదానంద మాట్లాడుతూ ఐదేళ్లలో జగన్ ప్రభుత్వం దళితులను కోలుకోలేని దెబ్బ తీసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. వచ్చే ఎన్నికల్లో దళితులంతా ఏకమై తగిన గుణపాఠం చెప్పడం ఖాయమని స్పష్టం చేశారు. కార్యక్రమంలోమ టీడీపీ దళిత నాయకులు సుజ్ఞానం, రవి తదితరులు పాల్గొన్నారు.

## కర్ణాటక మద్యం స్వాధీనం



పట్టుపడ్డ మద్యాన్ని చూపుతున్న సీఐ

**ఆదోని రూరల్ మార్చి 3 :** పెద్ద ఎత్తున ద్విచక్ర వాహనాల్లో కర్ణాటక నుంచి మద్యం తరలిస్తున్న ఆదోనికి చెందిన ఆరుగురిని రూరల్ పోలీసులు అదుపులో తీసుకున్నారు. ఆదివారం కర్ణాటక నుంచి ద్విచక్ర వాహనాల్లో మద్యంను తరలిస్తున్నారని సమాచారం రావడంతో ఇస్వీ ఎస్.ఐ శ్రీనివాసులు, పెద్దతుంబళం ఎస్.ఐ పీరయ్య, సిబ్బందితో కలిసి సీఐ నీరంజన్ రెడ్డి నాగనాథనహళ్లి గ్రామ శివారులో దాడులు నిర్వహించారు. ఆదోనికి చెందిన దూద్‌పీరా, పీర్ సాబ్, షేక్షావలి, దిల్వార్ హుసేన్, మునిస్వామి, ఆంజి, లక్ష్మీనారాయణను అదుపులో తీసుకొని వీరి వద్ద నుంచి 34 బాక్సుల మద్యంతోపాటు 6 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకొన్నారు. రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

## మట్కా బీటర్ల అరెస్టు

**ఆలూరు, మార్చి 3:** ఆలూరు మండలం మొలగవల్లి గ్రామానికి చెందిన ఎరుకుల కాశీనాథ్, బోయ శ్రీనివాసులు మట్కా నిర్వహిస్తున్నారనే సమాచారం రావడంతో ఆలూరు ఎస్సై ఓబులేషు సిబ్బంది ఆదవారం దాడులు చేశారు. మట్కా నిర్వహిస్తున్న ఇద్దరిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.40,500 స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

## మహిళల హక్కులను కాలరాస్తున్న బీజేపీ

**ఎమ్మిగనూరు,మార్చి 3:** మహిళల హక్కులను కాలరాస్తున్న బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడాలని ప్రగతిశీల మహిళా సంఘం డివిజన్ నాయకులు విజయకుమారి, రేణుక అన్నారు. ఆదివారం పట్టణంలోని సంఘం కార్యాయలం దగ్గర ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మార్చి 8 అంతర్జాతీయ శ్రామిక మహిళా పోరాట దినోత్సవం పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో నాయకురాళ్లు పార్వతి, రమిజాబీ, సరోజ, రత్నమ్మ, లక్ష్మి, నాగేంద్రమ్మలు పాల్గొన్నారు.

## ప్రజా మన్ననలే ఆదర్శం

● మఠం మేనేజర్ ఎస్‌కే శ్రీనివాసరావు



ఎస్ఐ వేణుగోపాల్‌రాజును సన్మానిస్తున్న అధికారులు

**మంత్రాలయం, మార్చి 3:** ఉద్యోగ సేవలో ఉంటూ ప్రజా మన్ననలు పొందినప్పుడే మంచి గుర్తింపు వస్తుందని, దానిని ఆదర్శంగా తీసుకొని ముందుకు వెళ్లాలని మఠం మేనేజర్ ఎస్‌కే శ్రీనివాసరావు, మంత్రాలయం సీఐ ఎరిషావలి, గురెడ్డి భీమిరెడ్డి అన్నారు. ఆదివారం రాత్రి భూరమణ కల్యాణ మండపంలో బదిలీపై వెళ్తున్న ఎస్ఐ వేణుగోపాల్ రాజుకు మంత్రాలయం ఎస్ఐ గోపీనాథ్ ఆధ్వర్యంలో సన్మాన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా శాలువ, పూలమాలలతో, మెమెంటోలు అందజేసి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచు తెల్లబండ్ల భీమయ్య, మాదవరం, కౌతాళం ఎస్ఐలు క్రిష్ణమూర్తి, నరేంద్ర కుమార్ రెడ్డి, వైస్ ఎంపీపీ రాఘవేంద్ర, గోరుకల్లు క్రిష్ణ, మల్లికార్జున, జనార్దన్ రెడ్డి వివిధ గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

## మంత్రాలయంలో భక్తుల రద్దీ

**మంత్రాలయం, మార్చి 3 :** రాఘవేంద్ర స్వామి దర్శనార్థం వచ్చిన భక్తులతో మంత్రాలయం కిక్కిర్సింది. ఆదివారం సెలవుదినం కావటంతో దక్షణాది రాష్ట్రాలనుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చారు. దీంతో మఠం ప్రాంగాణం భక్తులతో రద్దీగా మారింది. అన్నపూర్ణ భోజనశాల, మహాముఖద్వారం, ప్రధాన రహదారులు, మధ్వమార్గ్ కారిడార్, రాఘవేంద్ర సర్కిల్, నదీతీరం భక్తులతో కోలాహలంగా మారింది. గ్రామదేవత మంచాలమ్మను దర్శించుకొని రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. క్యూలైన్లు, పరిమళప్రసాదం వద్ద భక్తుల సందడిగా మారింది.

## శ్రీశైలానికి బయలుదేరిన శివస్వాములు

**పెద్దకడుబూరు మార్చి 3:** దొడ్డిమేకల గ్రామంలో ఆదివారం 80 మంది శివస్వాములు శ్రీశైలానికి బయలు దేరారు. స్థానిక ఈశ్వరుని దేవాలయంలో పరమేశ్వరుడికి పూజలు చేశారు. అనంతరం గ్రామ సర్పంచు చంద్రశేఖర్ ఆధ్వర్యంలో స్వాములు పాదయాత్రను గ్రామ పొలిమేర దాకా వెళ్లి సాగనంపారు. శివస్వాములు వెంట మహిళలు కూడా పాదయాత్రగా వెళ్లారు